ప్రజాశక్తి

సోమవారం 9 అక్టోబర్ 2023 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

పత్తికి తెగులు.. రైతుకు గుబులు..

- పెరిగిన పెట్టుబడి
- తగ్గిన దిగుబడి
- వర్షాభావంతో ఎండుతున్న పంటలు
- అన్నదాతల్లో ఆందోళన

తెగులు సోకిన పత్తి పంట

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

తెగుళ్ల కారణంగా గతేడాది పత్తి పంటలో ఆశించిన మేర దిగుబడి రాలేదు. అయినప్పటికీ రైతులు తిరిగి పత్తి పంట వైపే మొగ్గు చూపారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో ఈసారి ఎక్కువగా పత్తి, మిర్చి, కంది పంటలను రైతులు సాగు చేశారు. పత్తి పంటకు తెగులు సోకడంతో రైతులు దిగాలు పడుతున్నారు. ఓ వైపు వర్షాలు లేకపోవడం, మరోవైపు తెగుళ్లు రైతులను మరింతగా కుంగదీస్తున్నాయి. ఎకరా పత్తి పంటకు ఒకసారి పురుగుల ముందులు పిచికారీ చేయాలంటే సుమారు రూ. రెండు వేల ఖర్చవుతుంది. పత్తి చేతికి వచ్చేలోగా కనీసం ఐదారుసార్లు మందులు పిచికారీ చేయకుంటే గులాబీ రంగు పురుగు ఆశించి పంట పూర్తిగా దెబ్బతింటోంది. గులాబి రంగు పురుగుతో పాటు పూత రాలిపోవడం, పంట ఎదుగుదల లేకపోవడం తదితర సమస్యలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నియోజకవర్గంలో సాగు ఇలా..

నియోజకవర్గంలోని యర్రగొండపాలెం మండలంలో 2,949 హెక్టార్లు, పెద్దారవీడు మండలంలో 2,572 హెక్టార్లు, పుల్లలచెరువు మండలంలో 3,101 హెక్టార్లు, పెద్దదోర్నాల మండలంలో 2,024 హెక్టార్లు, త్రిపురాంతకం మండలంలో 737 హెక్టార్లలో పత్తి పంటను సాగు చేశారు. పత్తి పంటకు డిమాండ్ ఉండటంతో వివిధ విత్తనాల కంపెనీలు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి నకిలీ విత్తనాలను రైతులకు కట్టబెడుతున్నాయి. పంట ఎదుగుదల ఉన్నా దిగుబడి ఆశించినంతగా రావడం లేదు. పత్తికి గులాబి రంగు పురుగు ఎక్కువగా ఆశించింది. రైతులు వెంటనే సస్యరక్షణ చర్యలు తీసుకోకపోతే పూర్తి దెబ్బతినే పరిస్థితి ఉంది. పత్తి పంటకు ఎకరాకు దాదాపు రూ.50 వేలకు ▶ 2లో

కనీస వసతులకు కూడా నోచని ఇందిరమ్మ కాలనీ ఇదే..

'ఇందిరమ్మ'లో సమస్యల తిష్ట

- పంచాయతీలో లేక
- మున్సిపాలిటీలో చేర్చక
- త్రిశంకు స్వర్గంలో కాలనీ వాసులు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-మార్కాపురం

ప్రభుత్వం జగనన్న కాలనీలపై చూపుతున్న ప్రేమ, ఇందిరమ్మ కాలనీలపై ప్రభుత్వం చూపడం లేదు. ఇందిరమ్మ కాలనీ ఏర్పడి రెండు దశాబ్దాలకు దగ్గరవుతున్నా పాలకులు పట్టీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ఇందిరమ్మ కాలనీ వాసులు అసౌకర్యాల నడుమ జీవనం సాగిస్తున్నారు. అనేక మార్లు ప్రజా ప్రతినిధులకు, ఉన్నతాధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు.

డాక్టర్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2005లో అర్బన్ ప్రాంతాల్లో పేదల సొంతింటి కల నెర వేర్చేందుకు ఇందిరమ్మ కాలనీల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. మూడు విడతల్లో పేదలందరికీ సొంతింటిని సమకూర్చాలని రాజశేఖరరెడ్డి నిర్ణయిం చారు. అదే సమయంలో మార్కాపురం మున్సిపాలిటీలో లబ్ధిదారుల ▶ 2లో

పేదల భూములపై పెద్దల కన్ను

- అసైన్డ్ భూములు ఆక్రమించి ఇసుక తరలింపు
- జేబులు నింపుకుంటున్న అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో లబ్ధిదారులు

ఇసుక తరలింపుతో చీరాల ప్రాంతంలో ఏర్పడిన గుంత

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలో సముద్రతీర ప్రాంత భూముల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. దశాబ్దాల క్రితం పేదలకు ఇచ్చిన సొసైటీ భూములపై కన్నేసిన కొందరు అధికార అండగా లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తరలిస్తున్నారు. ఈ తతంగమంతా అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే జరుగుతోంది. దీంతో సెబ్, పోలీస్, రెవెన్యూ అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారు. బాపట్ల జిల్లాలోని చినగంజాం, వేటపాలెం, చీరాల, బాపట్ల తదితర మండలాల్లో 1950 నుంచి 1960 సంవత్సరాల్లో అప్పటి ప్రభుత్వాలు పేద, బలహీనవర్గాల వారికి అసైన్డ్ భూములను ఎకరం, అరెకరం చొప్పున మంజూరు చేశారు. ఆభూములను కొందరు సాగు చేసు కుంటున్నారు. కొందరు అమ్ముకున్నారు. కొంత భూముల్లో ఇసుక దిబ్బలు ఉండడంతో సాగు చేసే వీలులేక లబ్ధిదారులు అలాగే వదిలి వేశారు. ఇటీవల కాలంలో ఇసుకకు డిమాండ్ ఏర్పడింది. దీంతో అధికారపార్టీ నేతలు ఆ భూములపై కన్నేశారు. పేదల కిచ్చిన భూములను కొనుగోలు చేశారు. ఇసుక అక్రమంగా అమ్ము కుంటూ తమ జేబులు నింపుకుంటున్నారు.

కారంచేడు బాధితుల భూముల్లో...

1985లో కారంచేడులో అగ్రవర్ణాల దాడిలో బాధితులైన విజయనగర్ కాలనీ వాసులకు అప్పట్లో పునరావాస చర్యల్లో భాగంగా అప్పటి ప్రభుత్వం 62 ఎకరాల భూమిని కేటాయించింది. బాధిత కుటుంబాల్లో చదువుతున్న వారికి ఉద్యోగాలు ఇచ్చారు. కొందరికి స్వయం ఉపాధి కోసం రుణాలు ఇచ్చారు. ఎలాంటి వ్యక్తిగత లబ్ధి పొందని వారిని దష్టిలో పెట్టుకొని ప్రభుత్వం 62 ఎకరాల భూమిని కేటాయించింది. వేటపాలెం మండలం కొత్తపేట, పుల్లరిపాలెం పంచాయతీల పరిధిలోనిఒక్కొక్క కుటుంబానికి అర ఎకరం చొప్పున భూమి ఇచ్చారు. ఆ భూములను కొందరు సాగు చేసు కుంటున్నారు. ఇసుక దిబ్బలు ఉన్న భూములను కొందరు అలాగే వదిలేశారు. ప్రస్తుతం ఆ భూమి ఇసుక అక్రమార్కుల చేతిలో చిక్కింది. ఇసుక దిబ్బలనుంచి ఇసుక యథేశ్చగా తవ్వేస్తున్నారు. అన్యాక్రాంతమైన తమ గ్రామ భూమిని కాపాడి లబ్ధిదారులందరికీ సమానంగా పంపిణీ చేయాలని విజయనగర్ కాలనీ వాసులు కోరుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. గతంలో కాలనీ వాసులకు ఇచ్చిన భూమికి ఇప్పటి ▶ 2లో

మూలన పడేసిన ఫాగింగ్ మిషన్

ఫాగింగ్‌కు పాతర.. దోమల జాతర..

- మూలపడిన యంత్రాలు
- ప్రజలకు తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంనకు చెందిన ఓ యువకుడు చలి జ్వరంతో ఆసుపత్రికి వెళ్లాడు. వైద్యులు పరీక్షలు చేసి డెంగ్యూ లక్షణాలు ఉన్నట్లు చెప్పారు. మూడు రోజులు పాటు ఆసుపత్రిలో ఉండి చికిత్స పొంది ఇంటికి వచ్చాడు. వేల రూపాయలు వైద్యానికి వెచ్చించారు. మరో మహిళ డెంగ్యూ లక్షణాలతో గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.

యర్రగొండ టపాలెం మండల పరిధిలోని గ్రామాల్లో దోమల దండయాత్ర మొదలైంది. వాటి నిర్మూలనకు ఫాగింగ్ యంత్రాలు ఉన్నా అవి సక్రమంగా వినియోగించు కోక పోవడంతో మూలకు చేరాయి. ఫలితంగా దోమలు విజంభించి ప్రలకు విషజ్వరాల బారీన పడుతున్నారు. కొలుకుల, అమను గుడిపాడు, వాదంపల్లి, గుర్రపుశాల, తమ్మడపల్లి, అయ్యంబొట్లపల్లి, యర్రగొండపాలెం గ్రామాల్లో మురుగు కాలువలు సక్రమంగా లేవు. ఇళ్ల నుంచి మురుగు నీరు బయటకు వచ్చిన నీరు రోడ్లపైనే తిష్ట వేస్తుంది. దోమల దోప్తి చెందిన ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు,వర్షాల కారణంగా జలుబు జ్వరాలతో బాధపడుతున్న ▶ 2లో

'ఇందిరమ్మ'లో సమస్యల తిష్ట

(మొదటి పేజీ తరువాయి)

ఎంపిక చేశారు. ఇల్లు లేని4034 మందిని గుర్తించారు. మార్కాపురం పట్టణ సమీపంలోని అల్లూరి పోలేరమ్మ దేవస్థానానికి తూర్పు వైపున కొద్ది దూరంలో 1990 ప్లాట్లను సిద్ధం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని చెన్నరాయునిపల్లికి సమీపంలో 2044 ప్లాట్లను సిద్ధం చేశారు. అనంతరం లబ్ధిదారులకు ప్లాట్లు అప్పగించారు. ప్రభుత్వ సాయం పోగా మిగిలిన మొత్తాన్ని లబ్ధి దారులు సమకూర్చుకుని గృహాలు నిర్మించుకున్నారు.

ఇందిరమ్మ మొదటి విడత కాలనీలో 1200 గృహాలకు గాను సౌకర్యాలు లేని కారణంగా 400 కుటుంబాలు మాత్రమే నివాసం ఉంటున్నాయి. రెండవ విడత కాలనీలో గృహాలు అసంపూర్తిగా వదిలేశారు. మూడవ విడత కాలనీలో చాలా వరకు గృహాల నిర్మాణమే జరగలేదు.

ఇందిరమ్మ కాలనీ నరసింహాపురం ఇలాఖాలో ఉంది. ఇది పూర్తిగా గ్రామీణ ప్రాంతం. లబ్ధిదారులంతా మున్సిపాలిటీకి చెందిన వారు. పట్టణానికి దగ్గరలో ఉంది కదా అని ఆశ పడ్డారు. ఆ కాలనీ నేటికీ పంచాయతీలో లేక... మున్సిపాలీటీలో లేక కనీస సౌకర్యాలకు దూరంగా ఉంది. ఇందిరమ్మ కాలనీలో ప్రభుత్వ బడి లేదు. అంగన్‌వాడీ కేంద్రం లేదు. ఆరోగ్య కేంద్రం అసలే లేదు. ప్రభుత్వ పరంగా అందాల్సిన సౌకర్యాలేమీ అక్కడ కనిపించవు. కాలనీలకు వాటర్ ట్యాంకులు నిర్మించారు. బోర్లు వేశారు. వాటిని ఆపరేట్ చేసేందుకు కార్మికులను నియ ఎమించలేదు. ఏదైనా బోరు మరమ్మతులకు గురైతే బాగు చేయించే వారు లేదు. మున్సిపాలిటీ అధికారులు తమ పరిధి కాదని చెబుతున్నారు. నరసింహాపురం గ్రామం రికార్డుల్లో తప్ప ఊరే లేదు. విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారు. వీధి దీపాలు మాత్రం అక్కడి ప్రజలు ఏర్పాటు చేసుకున్నారు. రాకపోకలకు రహదారులు కూడా సక్రమంగా లేవు. ఎలాంటి రవాణా సౌకర్యం లేకపోవడంతో ఆటో బాడుగలకు రూ. వందల్లో చెల్లించి ఇంటి చేరుకోవాల్సి ఉంది. కాలనీలో రహదారులు, మురుగు కాలువల నిర్మాణమే జరగలేదు. కాలనీ ప్రధాన రహదారి పూర్తిగా మట్టిరోడ్డు. వర్షాల సమయంలో అది జారుడు బల్లగా మారుతోంది. రహదారులు, మురుగు కాలువలు, బడి, వైద్యశాల, అంగన్‌వాడీ కేంద్రం వంటి సౌకర్యాలు కల్పిస్తే అక్కడ కాలనీ అభివృద్ధి చెందే అవకాశం ఉంది. లబ్ధిదారులు కూడా మున్సిపాలిటీ ఓటర్లే అయినందున ఆ కాలనీ పట్టణానికి దగ్గరలో ఉంది కాబట్టి మార్కాపురం మున్సిపాలిటీలో ఇందిరమ్మ కాలనీలో విలీనం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్థానికులు వేడుకుంటున్నారు.

పత్తికి తెగులు... రైతుకు గుబులు..

(మొదటి పేజీ తరువాయి)

పైగా పెట్టుబడి అవుతోందనీ, ఈసారి పత్తి పంట దిగుబడి ఆశించినంతగా వచ్చేలా లేదని రైతులు వాపోతున్నారు.

ఎన్ని మందులు కొట్టినా తెగుళ్లు తగ్గడం లేదు

గొంగటి పుల్లారెడ్డి, రైతు సాయిబాబా నగర్

మందులు కొట్టినా పత్తి పంటకు ఆశించిన తెగుళ్లు తగ్గడం లేదు. మార్కెట్‌లో అందుబాటులో ఉన్న అన్ని రకాల మందులను కొనుగోలు చేసి పిచికారీ చేస్తున్నాం. అయితే ప్రయోజనం లేదు.

రైతులకు సూచనలు ఇస్తున్నాం

నీరజ, ఏడీఏ, యర్రగొండపాలెం

వ్యవసాయ సిబ్బందితో ప్రతి గ్రామంలో పంట నమోదుతో పాటు రైతులకు చీడల నివారణ చర్యల గురించి వివరించేలా చర్యలు తీసుకుంటున్నాం.

ఫాగింగ్‌కు పాతర.. దోమల జాతర

(మొదటిపేజీ తరువాయి)

రోగులతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. పంచాయతీల్లో ఫాగింగ్ యంత్రాలు అందుబాటులో ఉన్నా దోమల నియంత్రణ చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. యర్రగొండపాలెం మండలంలో 18 గ్రామ పంచాయ తీలు ఉండగా రెండేళ్ల కిందట స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ఫాగింగ్ యంత్రాలు, బుష్ కట్టర్లు, ఇన్సులేటర్లు, మిస్ట్ బైజర్లు ప్రభుత్వం అందించింది.

పంచాయతీలకు భారం..

ఫాగింగ్ యంత్రాల వినియోగం పంచాయతీలకు భారంగా మారుతోంది. యంత్రాల్లో డీజిల్, వీధుల్లో తిరిగేందుకు మరో వాహనానికి ఖర్చులు కలిపి సుమారు ఒక్కరోజుకి రూ. 2,000 అవుతోందని పాలకవర్గాలు చెబుతున్నాయి.

చినుకు రాలదు.. గింజ పట్టదు

ఆందోళనలో సజ్జ రైతులు

ప్రజాశక్తి-సిఎస్ పురం

వరుణ దేవుడు కరుణించకపోవడంతో వేసిన పంటలు వేసినట్లే ఎండిపోతున్నాయి. గత నాలుగు నెలలుగా సరైన వర్షాలు లేకపోవడం వల్ల రైతులు సాగు చేసుకున్న పంటలు ఎండలకు నిలువునా మాడిపోతున్నాయి. ఒక్క పదును వాన అయినా కురవకపోవడంతో సిఎస్ పురం మండల రైతులు దిగాలు పడ్డారు. పంట చేతికొచ్చేసరికి వర్షం లేక సజ్జ కంకులకు గింజ పట్టక నిలువునా ఎండిపోతుంటే రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. మండలంలోని సజ్జ పంట సాగు చేసిన రైతుల దీనస్థితి ఇది. మూడు నెలలుగా అడపాదడపా వర్షాలు పడడంతో కొందరు రైతులు సజ్జ పంటను సాగు చేశారు. ఈ పంట కంకి దశకు వచ్చేసరికి వర్షాలు కురవకపోవడంతో కంకిమీద ఉన్న సుంకు మీద గింజ పట్టక నిలువునా ఎండిపోతోంది. ఒక పదును వర్షం పడినా సజ్జ కంకులకు గింజ పూర్తి స్థాయిలో పట్టి దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం సుంకు మీదనే కంకి ఎండిపోవడంతో పంట చేతికి రాదని రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ బావుల్లో, బోర్లల్లో నీరు పూర్తిగా అడుగంటిపోవడంతో కనీసం ఒక తడి నీరు పెట్టుకొనేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. కొద్దోగొప్పో బోర్లలలో వచ్చే నీటితో రైతులు సరిపెట్టుకుంటున్నారు. మండలంలో దాదాపు 250 ఎకరాలకు పైగా సజ్జ పంటను సాగు చేశారు. ప్రధానంగా

వర్షాభావం కారణంగా గింజ పట్టని సజ్జ కంకులు

ఈ సీజన్‌లో సజ్జ పంటను సాగు చేశారు. వి.బైలు, చెన్నపునాయునిపల్లి, డిజి పేట, అరివేములు, చింతలపాలెం, ఏకునాంపురం, వెంకటాయచెరువు, బొంతవారిపల్లి, చింతకూడు, పి నాగులవరం, నల్లమడుగుల తదితర గ్రామాల్లో రైతులు సజ్జ పంటను సాగు చేస్తున్నారు. సకాలంలో వర్షాలు బాగా కురిసినట్లయితే ఒక ఎకరాకు 10 క్వింటాళ్లకుపై దిగుబడి వస్తుంది. ప్రస్తుతం సగం దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని, పెట్టుబడులు కూడా రాక అప్పులపాలవ్వాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం సజ్జ క్వింటా రూ.2,300 వరకు కొనుగోలు చేసేవారని, దీని వల్ల ఎకరాకు రూ.30 వేలకు పైగా ఆదాయం వస్తుందని భావించిన రైతన్నలకు ఈ ఏడాది అప్పులు మిగిల్చి కన్నీరు పెట్టిస్తోందని వాపోతున్నారు. ప్రభుత్వం సజ్జ పంట రైతులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు

నూతి నరసింహులు, వి.బైలు, రైతు

ఎకరాకు రూ.10 వేలకుపైగా పెట్టుబడి పెట్టి రెండెకరాల్లో సజ్జ పంటను సాగు చేశాను. పంట సాగు చేసినప్పటి నుంచి వర్షాలు లేకపోవడంతో పంట నిలువునా ఎండిపోయింది. దీంతో పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

కళ్లముందే ఎండిపోయింది

తోట వెంకటేశ్వర్లు, వి.బైలు, రైతు

ఎకరం పొలంలో ఈ ఏడాది సజ్జ పంట సాగు చేశారు. సజ్జ పంట కాపుకొచ్చే దశలో ఒక్క చినుకైనా వర్షం కురవకపోవడంతో సాగు చేసిన పంటల కళ్లముందే ఎండిపోయింది. దీంతో పెట్టిన పెట్టుబడి పూర్తిగా రాదు.

పేదల భూములపై పెద్దల కన్ను

(మొదటి పేజీ తరువాయి)

వరకూ రెవెన్యూ అధికారులు ప్రొజిషన్ చూపలేదు. దీంతో ఆ భూమి ఆక్రమణదారుల చెరలో చిక్కినట్లు కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తునర్నారు.మ చినగంజాంలోనూ అసైన్డ్ భూములు, సొసైటీ భూముల నుంచి ఇసుకను తరలిస్తున్నారు. చీరాల,బాపట్ల మండలాల్లో కూడా ఎస్‌సి,బిసి వర్గాల వారికిచ్చిన అసైన్డ్ భూములు, అటవీశాఖకు సంబంధించిన భూముల నుంచి అధికార పార్టీ నేతలు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. ఇసుక తరలింపుతో పొలాల మధ్య పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఫలితంగా గంతల్లో నీరు చేరడంతో సాగు వీలు కావడం లేదు.కావూరివారిపాలెంలో మైనింగ్ శాఖ నుంచి గతంలో 4,999 క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకాలకు అనుమతి పొందారు. అది సాకుగా చూపి ఈ పాటికే 2 లక్షల క్యూబిక్ మీటర్లకు పైగా ఇసుక తవ్వకాలు చేట్టారు. గతంలో అప్పటి హోంమంత్రితో తమకు బంధుత్వం ఉందని చెప్పి కొందరు ఇసుక తరలించారు. ఇప్పుడు జిల్లా మంత్రి పేరు చెప్పి ఇసుక తరలిస్తున్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారు. సామాన్య ప్రజలు ఎవరైనా తమ సొంత అవసరాలను ఇసుక తరలిస్తుంటే మాత్రం రెవెన్యూ, సెబ్ , పోలీసు అధికారులు పట్టుకుంటున్నారు. జిల్లాలో ఎక్కడా ఇసుక తవ్వకాలకు అనుమతులు లేకపోయినా జెపి వెంచర్స్ పేరు చెప్పి కొందరు ఇసుకను తరలిస్తున్నారు.అధికార పార్టీ నేతలకు ఇసుక మంచి ఆదాయ వనరుగా మారింది. ఇసుక తరలింపులో తీరప్రాంత భూములు చౌడుగా మారుతున్నాయి. దీంతో అవి సాగుకు ఉపయోగపడం లేదు.

తరచూ రైళ్ల రద్దుతో ఇక్కట్లు

విజయవాడ, బెంగుళూరు వెళ్లే వారికి తీవ్ర ఇబ్బందులు • రోడ్డుమార్గానా సరైన రవాణా సౌకర్యం లేక సతమతం

ప్రజాశక్తి-దొనకొండ

రైల్వే అధికారులు డబ్లింగ్ లైను పనుల నిర్మాణం కోసం అంటూ తరచూ రైళ్లు మొత్తం రద్దు చేస్తుండటంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర రవాణా కష్టాలను ఎదుర్కొంటున్నారు. దొనకొండ మీదుగా అటు విజయవాడ, విశాఖపట్టణం, ఇటు బెంగుళూరు వెళ్లే ప్రజలు రైళ్లు రద్దుకావటం, రోడ్డు మార్గాన సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దొనకొండ మీదుగా గుంటూరు-గుంతకల్లు రైలు మార్గంలో ఒక్క గుంటూరు-తిరుపతి రైలు మినహా మిగిలిన అన్ని రైళ్లూ ఈ నెల 15వ తేదీ వరకు రద్దు చేశారు. గుంటూరు వైపు వెళ్లేందుకు ఉదయం 4-45 గంటలకు, నంద్యాల వైపు వెళ్లేందుకు సాయంత్రం 6-15 గంటలకు తిరుపతి-గుంటూరు రైలు మాత్రమే నడుస్తోంది. ఈ రైలులో ఎక్కేందుకు వీలులేనంతగా కిటకిటలాడుతూ ప్రయాణిస్తుండటంతో ప్రయాణం నరకంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. దొనకొండ నుంచి గుంటూరుకు రూ.60తో రైలు ప్రయాణం ఎంతో సౌకర్యవంతమని, బస్సుల్లో రోడ్డు మార్గాన దొనకొండ నుంచి గుంటూరుకు రూ.200 వరకు టికెట్ ఖర్చులు భరించినా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంత ప్రజలు విద్య, వైద్య, వ్యాపార తదితర పనుల నిమిత్తం వందల సంఖ్యలో ప్రజలు ప్రతిరోజూ అటు గుంటూరు, విజయవాడ, ఇటు మార్కాపురం, గిద్దలూరు ప్రాంతాలకు రైళ్లలో ఉదయం వెళ్లి సాయంత్రానికి చేరుతుంటారు. రైళ్లు రద్దు కావటంతో ఆటోల్లో ఇటు వినుకొండ అటు మార్కాపురం వెళ్లి రాకపోకలు సాగిస్తూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు పేర్కొంటున్నారు. దొనకొండ మీదుగా రాత్రివేళల్లో ప్రయాణించే రైళ్లను దొనకొండలో నిలపకపోవటంతో అవి నడుస్తున్నా తమకు ఎటువంటి ప్రయోజనం లేదని వాపోతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఆ రైళ్లు ఎక్కినా ఇటు వినుకొండ, అటు మార్కాపురం రైల్వే స్టేషన్లల్లో దిగి వందల రూపాయలు చెల్లించుకొని ఆటోల్లో దొనకొండకు చేరుకోవాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే అధికారులు ప్రజల రవాణా కష్టాలు గుర్తించి ఒకేసారి అన్ని రైళ్లు రద్దు చేయకుండా సౌకర్యవంతమైన ఒకటి రెండు రైళ్లు నడిచేలా చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రైళ్లు తిరగకపోవడంతో నిర్మానుష్యంగా మారిన దొనకొండ రైల్వే స్టేషన్

నాయకుల లబ్ధి కోసమే జగనన్న కాలనీలు

- మేడపి జగనన్న కాలనీ లే అవుట్‌లో రూ. లక్షల ప్రజాధనం వృధా
- లబ్ధిదారులకు చేకూరని న్యాయం

ముళ్ల చెట్లతో జగనన్న కాలనీ

ప్రజాశక్తి-త్రిపురాంతకం

పేదలకు పక్కా గృహాలు నిర్మించాలనే మంచి ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు వస్తే నాయకులు మాత్రం తమ లబ్ధి కోసమే లే అవుట్లను ఏర్పాటు చేసి రూ. లక్షల కొద్ది డబ్బులను దండుకుంటున్నారు. ఈ క్రమంలోనే త్రిపురాంతకం మండలం మేడపి గ్రామంలో 2021లో జగనన్న కాలనీకి శంకుస్థాపన చేశారు. ఆ గ్రామంలో నిరుపేదలైన 21 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేసి పక్కా గృహాలు మంజూరు చేశారు. అయితే ఆ లే అవుట్ గ్రామంలోని సమాదులకు దగ్గరగా ఉందని పక్కా గృహాలు నిర్మించుకోవడానికి పేదలు ముందుకు రాకపోవడంతో హుటాహుటిన జగనన్న కాలనీ చుట్టూ రూ. 30 లక్షల వ్యయంతో ప్రహరి గోడ నిర్మించారు. రోడ్డు లెవలింగ్ కోసం మరో రూ. 10 లక్షలు, కరెంటు కోసం రూ. 30 లక్షలు ఇలా మంజూరు చేసి కాంట్రాక్టర్లు, అధికారులు పనులు మమ అనిపించారు. నీకు సగం..నాకు సగం అంటూ డబ్బులు దండుకున్నారు. కాలనీకి శంకుస్థాపన చేసి రెండు సంవత్సరాలు దాటినా నేటికీ ఒక్కరు కూడా పక్కా గృహం నిర్మించుకోలేదు. దీంతో ఆ కాలనీ స్థలంలో వేసిన శిలాఫలకం ముళ్ల చెట్ల మధ్య దర్శనం ఇస్తోంది. ప్రభుత్వ లక్ష్యం నీరుగారింది.

రూ.1.80 లక్షలతో ఇళ్లు కట్టుకోలేం

ప్రభుత్వం పక్కా గృహం నిర్మాణానికి రూ.1.80 లక్షలు మాత్రమే మంజూరు చేయడంతో ఇంటిని నిర్మించుకోలేకపోతున్నాం. వారు ఇచ్చే రూ. 1.80 లక్షలు బేస్‌మట్టానికి కూడా సరిపోవు. కనీసం రూ. ఐదు లక్షలు అయినా ఉంటేగానీ ఇంటిని నిర్మించుకోలేం. అదే ఇంటి నిర్మాణం కోసం అప్పులు చేస్తే పూట గడవటమే కష్టమైన తమకు వడ్డీలు కూడా కట్టడం చేతకాదు. అందుకే పక్కా గృహం మంజూరైనా కట్టుకోలేకపోయాం.

షేక్ కరి మునిషా, మేడపి.

పక్కా రూ. 3.50 లక్షలు మంజూరు చేయాలి

పక్కా గృహం నిర్మించుకోవాలంటే కనీసం రూ. ఐదు లక్షలు కావాలి. మేడపి లే అవుట్‌లో 21 గృహాలకు గాను రూ. 37 లక్షలు ప్రభుత్వం మంజూరు చేస్తానంది. అయితే అనవసరంగా అదే లే అవుట్‌లో రూ. 70 లక్షలు ఖర్చు చేశారు. అవి ఖర్చు చేయకుండా లబ్ధిదారులకు రూ. 3.50 లక్షలు చొప్పున మంజూరు చేసి ఉంటే లబ్ధిదారులంతా సంతోషంగా ఇళ్లు కట్టుకునేవారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరేది. అలా కాకుండా నాయకుల లబ్ధికోసం ఏర్పాటు చేయడంతో ఒక్కరు కూడా ఇళ్లు కట్టుకోలేదు.

గొట్టెముక్కల రాజారామయ్య,
సిపిఎం మండల కార్యదర్శి, త్రిపురాంతకం.

కొండను తవ్వి... ఎలుకలు పట్టుకున్నారు...

- ఆన్‌లైన్‌లో ద్వారా క్రికెట్ బెట్టింగ్ జూదరులు ఇద్దరు అరెస్ట్
- స్టేషన్ బెయిల్ ఇచ్చిన పోలీసులు
- అంత గుట్టు చప్పుడు కాకుండా నే....

శింగరాయకొండ పోలీస్ స్టేషన్

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలంలో వైసిపి, టిడిపి నాయకులు ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ విషయం గురించి పోలీసులకు తెలిసిన విషయమే. పెద్దపెద్ద అనకొండలను వదిలేసి ...కొండను తవ్వి ఎలుకలు పట్టుకున్నారన్న సామెతను పోలీసులు రుజువు చేశారు. మండల పరిధిలోని 10 గ్రామపంచాయతీలో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ జోరుగా నిర్వహిస్తున్నారు. అందు కోసం కొందరు వైసిపి నాయకులకు నెలవారీ మాముళ్లు అందుతున్నాయి. పోలీసుల విషయంలో అంతా వారే చూసు కుంటామంటూ నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నారు. పోలీసులు వైసిపి నాయకుల చెప్పినట్లే చేస్తున్నారు. వారు చెబితేనే దాడులు నిర్వహిస్తున్నారు. వారు చెప్పిన వారికి స్టేషన్ బెయిల్ ఇస్తున్నారు. ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరిని పోలీసులు శుక్రవారం రాత్రి అరెస్టు చేశారు. వైసిపి నాయకుల సిఫార్సుతో వారికి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారు. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న శింగరాయకొండ మండలం మూలగుంటపాడుకు చెందిన నరాల ప్రసాద్, ఎం. శ్రీనివాసులును శింగరాయకొండ సిఐ దాచేపల్లి రంగనాథ్ టి.శ్రీరామ్ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.99 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.

అర్ధరాత్రి ప్రెస్ మీట్..

ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరిని పోలీసులు పట్టుకున్నారు. పోలీసు గ్రూపులో ఉన్న విలేకర్లకు శుక్రవారం అర్ధరాత్రి 12:31 గంటలకు ప్రెస్‌మీట్ ఉందని మెసేజ్ పంపారు. పోలీసులు ఇటీవల కాలంలో ఏ ఘటన జరిగినా ఫొటోలు దిగి విలేకర్లకు ఫొటో, మేటర్ మెసేజ్ పంపుతున్నారు. సమావేశానికి విలేకర్లను పిలిస్తే వారు ఏమి అడుగుతారోనని ఇలా చేస్తున్నారు. జిల్లా పోలీసులు సైతం విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేసి అన్ని వివరాలు చెబుతుంటే. శింగరాయకొండ సర్కిల్ పరిధిలోని పోలీసులు మాత్రం ఇలా చేస్తున్నారు. మన్నం ప్రసాద్ హత్యకేసులో నిందితులను 15 సంవత్సరాల తర్వాత తెలంగాణా రాష్ట్రంలో పట్టుకొని ఇక్కడి తీసుకొచ్చారు.ఆ విషయం గురించి విలేకర్ల సమావేశం నిర్వహించిన వివరాలు తెలుపలేదు. ఫొటోలు వీడియోలు పెట్టి వాట్సాప్ గ్రూపులో వదిలేశారు.

ఊరు దాటి పోయారు..

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరినీ పోలీసులు పట్టుకున్న విషయం తెలియడంతో శింగరాయకొండ, జరుగుమల్లి మండలాల్లో బెట్టింగ్ నిర్వహిస్తున్న వారు తెలంగాణా, చెన్నై, బెంగళూరు ప్రాంతాలకు వెళ్లిపోయారు. క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వారితో పోలీసులకు సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

స్టేషన్ బెయిల్ ఇచ్చి....

ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.99 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిని విచారిస్తే క్రికెట్ బెట్టింగ్ సూత్రదారులు బయటకు వచ్చేవారు. అయితే పోలీసులు అలా చేయకుండా వారికి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారు. వైసిపి నాయకులు ఒత్తిడి మేరకే పోలీసులు ఇలా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తరగతి గదుల కొరతతో విద్యార్థుల ఇకట్లు

ప్రజాశక్తి-కొమరోలు

మండలంలోని తాటిచెర్ల మోటు జడ్పీహెచ్‌ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తరగతి గదుల కొరతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో యూపీ ఎంపీ పాఠశాలగా ఉన్న పాఠశాల ప్రస్తుతం జడ్.పి.హెచ్.ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలగా అప్ గ్రేడ్ అయింది. దీంతో విద్యార్థుల సంఖ్య పెరగడంతో పాఠశాలలో తరగతి గదుల కొరత ఏర్పడింది. తరగతి గదుల కొరత వల్ల విద్యార్థులు రేకుల షెడ్డు కింద

తరగతి గదుల కొరతతో రేకుల షెడ్డు కింద చదువుతున్న విద్యార్థులు

చదువుకుంటున్నారు. వర్షం వచ్చినప్పుడు లేదా అధికంగా ఎండ కాసినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు అంటున్నారు. గదుల కొరతతో తాము సరిగ్గా చదువుకోలేక పోతున్నామని, వర్షాల సమయంలో చాలా ఇబ్బందులు పడుతున్నామని పలువురు విద్యార్థులు వాపోయారు.ఇప్పటికైన ప్రభుత్వం తమను దృష్టిలో ఉంచుకుని అదనపు తరగతి గదులు నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 200 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనం

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-ముండ్లమూరు

మండలంలోని ఉల్లగల్లు వద్ద ఆదివారం తెల్లవారు జామున 70 బస్తాల రేషన్ బియ్యాన్ని టాటా ఏస్ వాహనంలో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఏఎస్‌పి భవానీ హర్ష, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ ఎం రాఘవరావు దాడిచేసి పట్టుకున్నారు. ఈ బియ్యం దర్శిలోని ప్రముఖ వైసిపి నాయకుడివని సమాచారం. వాహనాన్ని ముండ్లమూరు పోలీస్ స్టేషన్‌కు తరలించి ఎస్ఐ వెంకటకృష్ణయ్య కేసు నమోదు చేసి బియ్యాన్ని చీమకుర్తిలోని సివిల్ సప్లై గోడౌన్‌కు తరలించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ రాఘవరావు తెలిపారు. ఈ దాడులలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటి రాజ్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం

100 బస్తాల బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

అక్రమంగా తరలిస్తున్న 100బస్తాలు రేషన్ బియ్యం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నసంఘటన ఆదివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. పర్చూరు ఎన్ఫో ర్స్మెంట్ డిప్యూటీ తాసిల్దార్ గీతారాణికి అందిన సమాచారం మేరకు సిబ్బం దితో నిఘా పెట్టారు. తెల్లవారు జామున సుమారు 4.30గంటల సమయంలో రాచపూడి గ్రామం వైపు నుండి వస్తున్న రేషన్ బియ్యం మినీ లారీ వాహనాన్ని హనుమోజిపాలెం గ్రామం వద్ద ఆపి తనిఖీచేశారు. మినీలారీలో 100బస్తాల రేషన్ బియ్యం ఉన్నట్లు నిర్ధారించారు. బియ్యాన్ని, మినీ లారీని స్వాధీనం చేసుకొని లారీ డ్రైవర్ నూతలపాటి లక్ష్మీనారాయణ, లారీ యజమాని ఆరవ మహేశ్వరరెడ్డి, రాచపూడి గ్రామస్తుడైన వెంకట సుబ్బారావుపైన స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై షేక్ నాయబ్ రసూల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. 100బస్తాల రేషన్ బియ్యం విలవ సుమారు రూ.1.90లక్షలు ఉంటుందని అంచనా. ఇదిలా ఉండగా బియ్యం స్వాధీనం చేసుకున్న అధికారులు పూర్తి సమాచారం ఇవ్వలేదు. సమాచారం చెప్పడానికి ఫోనులో కూడా స్పందించలేదు.

సమావేశంలో మాట్లాడుతున్న కొండయ్య

ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-వేటపాలెం

జనసేన నాయకుల ఆహ్వానం మేరకు వేటపాలెం మండలం జనసేన కార్యాలయంలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో సంయుక్తంగా పనిచేసి వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని, మంచి పరిపాలన కోసం మనమంతా కృషి చేసి సఫలీకృతం కావాలని ఎం.ఎం.కొండయ్య పిలుపిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమామహేశ్వరరావు, షేక్ యాసిన్, గజవల్లి శ్రీను, గంజి పురుషోత్తం, బొగ్గుల పార్థసారథి, నాసిక వీరభద్రయ్య, షేక్ మొహిద్దీన్ ఆర్. కె. నాయుడు, వాయిల శ్రీను, కొల్లూరి సుధీర్, తోట అశోక్ చక్రవర్తి, వాయిల సుబ్రహ్మణ్యం, కిరణ్ తేజ, బూడిద వరంలు సభావేదికపై ఆసీనులైనారు.

శాస్త్రీయ సమాలోచనలు పెంచాలి : జెవివి

డాక్టర్ సజ్జాలోకేశ్వరరావును సన్మానిస్తున్న వెంకటేశ్వరరావు

'సజ్జా'కు దేవాంగరత్న బిరుదు

ప్రజాశక్తి - చీరాల

వివిధ రంగాల్లో విశేష సేవలందించిన దేవాంగ ప్రతినిధులకు దేవాంగ రత్న బిరుదతో ఘనంగా సత్కరించారు. దేవాంగ సేవా సమితి ఆధ్వర్యంలో తిరుపతిలో దేవాంగ రత్న బిరుద ప్రధాన సభను నిర్వహించారు. తిరుపతి సత్రం మహాజన సభలో మావూరి వెంకటరమణ, దొంతశెట్టి వెంకట మనోహర్, నిమ్మల కృష్ణప్ప, తొగర్ల చిరంజీవి, డాక్టర్ సజ్జా లోకేశ్వరరావు, డాక్టర్ మంచు కుమారస్వామి, డాక్టర్ మెట్ల మధుసూదనరావు, డాక్టర్ దొంతంశెట్టి జోగారావు, దొంతంశెట్టి రత్నారెడ్డి, డాక్టర్ సత్రం మల్లేశ్వరరావు, నక్కిన త్రినాధ్‌రావులకు దేవాంగరత్న బిరుదు దయానందపురి మహాస్వామి సమక్షంలో ప్రధానం చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్న చీరాల చేనేత నాయకులు సజ్జ వెంకటేశ్వరరావు హాజరై మాట్లాడారు. తిరుపతిలో దేవాంగ సమాజం కోసం నిర్మించి తలపెట్టిన సంత్రం నిర్మాణానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తక్షణ విరాళం ప్రకటించారు.

పెనుమల సుబ్బారావు సంతాప సభలో నేతల నివాళి

సుబ్బారావుకు ఘన నివాళి

ప్రజాశక్తి - రేపల్లె

పెనుమల సుబ్బారావు మరణించినా బహుజనుల గుండెల్లో చిరకాలం జీవించిగా ఉంటారని దళిత ఉద్యోగులు ఉద్యమ సంఘాల ప్రతినిధులు కొనియాడారు. ఉప్పాడి రోడ్డులో సుబ్బారావు సంస్మరణ పెదకర్మ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రంలో తెనాలి మునిసిపల్ కమీషనర్ మెడికొండ జస్వంతరవు, జైభీం భారత్ పార్టీ జిల్లా అధ్యక్షులు దోవా రమేష్ రాంజీ, సిపిఎం కార్యదర్శి సిహెచ్ మణిలాల్, సముద్రాల అంబేద్కర్, మునిపల్లె సుబ్బయ్య, గుంటూరు విజయ కుమారి, పిల్లి సంపత్ కుమార్, ఇ చెన్నయ్య, దారం సాంబశివరావు, దాసరి ఏడు కొండలు, నీలా జోజిబాబు, భీంరెడ్ కంచర్ల శేషుకుమార్, జూలకంటి బుజ్జి, కర్రా బాబురావు, పోతార్లంక శివ, వెంకటేశ్వరవు, మండే యాకోబు పాల్గొన్నారు.

సమావేశంలో సిపిఎం, సిపిఐ నాయకులు

విద్యుత్ ఛార్జీల పెంపుపై ఆందోళనలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రభుత్వం గడచిన నాలుగేళ్లలో 8విడతలుగా పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో చేపట్టనున్న ఆందోళనలను జయప్రదం చేయాలని సిపిఎం, సిపిఐ నాయకులు రోడ్డు సత్యనారాయణ, గొట్టుముక్కల బాలాజీ కోరాఆరు. స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు సిఎం జగన్మోహన్ రెడ్డి విద్యుత్ చార్జీలను పెంచబోమని హామీ ఇచ్చి అధికారానికి వచ్చిన తర్వాత అందుకు వ్యతిరేకంగా 8విడుదలగా చార్జీలు పెంచి ప్రజలనడ్డి విడిచారని అన్నారు. ఈనెల 9నుండి 15వరకు జరిగే ఆందోళనలో భాగంగా 11న బట్టిప్రోలులో జరిగే ధర్నాకు ప్రజలు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బట్టు నాగమల్లేశ్వరరావు, బండారు శ్రీనివాసరావు, ప్రజాసంఘాల నాయకులు మోహనరావు, శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రజాశక్తి - బాపట్ల

సమాజంలో శాస్త్రీయ సమాలోచన పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక కృషి చేయాలని జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు కోరారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జరిగిన జెవివి సమావేశంలో మాట్లాడారు. ఈనెల 22న చీరాల ఎన్జీవో హోంలో జరుగనున్న సైన్స్ సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ప్రజల్లో మూఢనమ్మకాలను పారదోలి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు కృషి జరగాలని అన్నారు. జన విజ్ఞానం పేరుతో ఒక సైన్స్ పత్రికను రాష్ట్ర స్థాయిలో ఆన్లైన్ పత్రికగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. చెకుముకి జిల్లా సంబరాల నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాలల్లోని సైన్స్

జెవివి సమావేశంలో మాట్లాడుతున్న కుర్రా రామారావు

ఉపాధ్యాయులను జెవివి బాధ్యతల్లోకి తీసుకుని చెకుముకి పరీక్షను సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. జిల్లా సాంస్కృతిక కన్వీనర్ దక్షిణామూర్తి మాట్లాడుతూ 10మంది కళాకారులతో టీంను ఏర్పాటుచేసి పాఠశాలల్లో విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు శాస్త్రీయ ఆలోచనలపై అవగాహన కల్పించాలన్నారు. సీనియర్ నాయకులు ప్రసాదరావు మాట్లాడుతూ అధికారుల ద్వారా సైంటిఫిక్ టెంపర్ డేను ప్రతి పాఠశాలలో జరిగే విధంగా కృషి చేయాలన్నారు. కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఊరూరా జనవిజ్ఞానం పేరుతో సమాజ చైతన్యానికి కృషి చేస్తున్నామన్నారు. ఆకాశంలో సగం - అవనిలో సగం పేరుతో మహిళల పట్ల మరింత గౌరవాన్ని పెంచే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. సమావేశానికి బాపట్ల జిల్లా అధ్యక్షులు యాజలి భాస్కరరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ మృతికి సంతాపం ప్రకటించారు. జెవివి నాయకులు కుర్రా శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి తంగా శ్రీనివాసరావు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు, యూటీఎఫ్ పట్టణ నాయకులు రాజేష్ పాల్గొన్నారు.

శ్రామిక మహిళలకు పని భారం తగ్గించాలి

ప్రజాశక్తి - బాపట్ల

అనేక రంగాల్లో పనిచేస్తున్న శ్రామిక మహిళలకు పని భారాన్ని తగ్గించాలని శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ రేఖ ఎలిజిబెత్ అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం జరిగిన శ్రామిక మహిళ జిల్లా సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలకు పని కాలంతో సంబంధం లేకుండా వివిధ రంగాల్లో 10 నుండి 12గంటల పాటు పని చేయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ యాప్‌ల పేరుతో అనేక రంగాల్లో మానసిక ఒత్తిడి గురవుతున్నారని అన్నారు. అంగన్వాడి, ఆశ, మిడ్ డే మీల్స్, పంచాయతీ, మున్సిపల్, ఆక్వా రంగాల్లో పనిచేస్తున్న మహిళలకు కనీస వేతనాలు అమలు కావడం

శ్రామిక మహిళ సమావేశంలో మాట్లాడుతున్న ఎలిజిబెత్‌రేఖ

లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పని ప్రదేశాలలో మహిళలను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నారు. ప్రతి సంస్థలో మహిళలతో ఒక కమిటీని ఏర్పాటు చేసి మహిళల ఫిర్యాదులు తీసుకునే విధంగా ఒక విభాగాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు తీర్పు వెలువరిం చినప్పటికీ అనేక సంస్థల్లో అమలు కావడం లేదన్నారు. మహిళలపై వేధింపులు గురి చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలన్నారు. బాధితులకు సత్వర న్యాయం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం శ్రామిక మహిళలకు పని భద్రత కల్పించి, కనీస వేతనాలు అమలు చేయాలని సదస్సు తీర్మానించింది. మహిళల హక్కుల కోసం ఆందోళనలు చేయాల్సి వస్తుందన్నారు. సదస్సుకు కుంచాల లక్ష్మి అధ్యక్షత వహించారు. సదస్సులో శ్రామిక మహిళ జిల్లా నాయకులు జి శారద, సుబ్బరావమ్మ, వెంకటలక్ష్మి, రమా దేవి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుం దార్, సిఐటియు నాయకులు శామ్యూల్ పాల్గొన్నారు.

ఖోఖోలో మెరిసిన క్రీడాకారులు

- పంగులూరు నుండి అంతర్జాతీయ పోటీలకు
- ఖోఖోలో ఖ్యాతిగాంచిన పంగులూరు అసోసియేషన్
- అంచెలంచలుగా ఎదిగిన క్రీడాకారులు, కోచ్

ప్రజాశక్తి - పంగులూరు

మలేషియా దేశంలోని కౌలాలంపూర్ పట్టణంలో ఈనెల 12నుండి 16వరకు జరిగే జూనియర్ (అండర్ -18) అంతర్జాతీయ బాలబాలికల ఖోఖో పోటీలలో భారతదేశం తరపున ఒక కోచ్, ఇద్దరు క్రీడాకారులు ఆడేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ఎంపికైనట్లు ఎపి ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి విలేకరుల సమావేశంలో ఆదివారం తెలిపారు. ఈ ముగ్గురిలో కోచ్‌గా ఎంపికైన నక్క ఆవులయ్య పంగులూరులోని ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో చాలా కాలం కోచ్‌గా పని చేశాడని తెలిపారు. క్రీడాకారుడుగా ఎంపికైన రేజేటి సూరి నాయుడు కూడా ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో క్రీడాకారుడుగా ఎదిగి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎన్నో బహుమతులు సాధించాడని తెలిపారు.

అంచెలంచలుగా ఎదిగిన ఆవులయ్య

పుల్లలచెరువు మండలంలోని మారు మూల అటవీ గ్రామమైన తెల్లగట్లు గ్రామానికి చెందిన నక్కా ఆవులయ్య (ఎన్ఐసి)ను గత నెల 15నుండి ఈ నెల 8వరకు ఢిల్లీలోని జవహర్లాల్ స్టేడియంలో ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో

ఖోఖో కోచ్ నక్క ఆవులయ్య

జూనియర్ ఇండియా బాలుర ఖోఖో కోచింగ్ క్యాంపుకి కోచ్‌గా ఆంధ్రప్రదేశ్ ఖోఖో అసోసియేషన్ నియమించింది. ఈనెల 12నుండి 16వరకు మలేషియాలో జరిగే అంతర్జాతీయ ఖోఖో పోటీలకు కోచ్‌గా ఆవులయ్య నియమితులైనట్లు ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (కెకెఎఫ్ఐ) ఆదివారం ఉదయం తెలిపింది. ఆవులయ్య 2011-12లో ఎన్ఐఎస్, తరువాత పీహెచ్‌డి చేసి, 2017లో పంగులూరులోని మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలోని ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో కోచ్‌గా చేరి సబ్ జూనియర్, నేషనల్, జూనియర్ నేషనల్, సీనియర్ నేషనల్, సౌత్ జోన్ నేషనల్, ఫెడరేషన్ కప్, ఆంధ్ర ప్రదేశ్ కోచ్‌గా వ్యవహరించడమే కాక, అల్టిమేట్ ఖోఖో జట్టుకు కోచ్‌గా వ్యవహరించి బంగారు పథకాలు సాధించడానికి కారకుడు అయ్యారు. ఆవులయ్య ప్రస్తుతం డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీలో చినలాట రఫీలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తన ప్రతిభను గుర్తించి పలుమార్లు ప్రోత్సహించి, తనను ఈ స్థాయికి తెచ్చిన ఆంధ్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారాంరెడ్డికి ఆవులయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఆవులయ్యను ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎంఎల్ఎ బాచిన చెంచుగరటయ్య, ఖోఖో అధ్యక్షుడు టిఎస్ఆర్‌కె ప్రసాద్, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ సభ్యులు, ప్రకాశం జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు భాస్కరరావు, కాశీ విశ్వనాథరెడ్డి, వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.

ప్రతిభ చాటిన క్రీడాకారుడు రేజేటి సూరి నాయుడు

స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలోని ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో 8వ తరగతిలో రేజేటి సూరి నాయుడు చేరాడు. ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఉమ్మడి ప్రకాశం జిల్లా జె వ ం గ ు ల ూ ర ు లో ఉంటున్నాడు. ప్రకాశం

క్రీడాకారుడు సూరినాయుడు

జిల్లా తరపున అండర్ -18 విభాగంలో బాలుర ఖో ఖో పోటీల్లో పాల్గొని ఎపి తరపున గత మార్చి నెలలో పశ్చిమ బెంగాల్లోని బన్సూరి పట్టణంలో జరిగిన జూనియర్ జాతీయ ఖోఖో పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచాడు. అంతర్జాతీయ జట్టులో (అండర్ -18 విభాగంలో) స్థానం సంపాదించాడు. ఈనెల 12నుండి 16వరకు మలేషియా దేశంలోని కౌలాలంపూర్ పట్టణంలో జరిగే జూనియర్ అంతర్జాతీయ ఖోఖో పోటీల్లో పాల్గొనబోతున్నాడు. అండర్ -14 విభాగంలో పూణేలో జరిగిన జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొన్నాడు. మధ్యప్రదేశ్ లోని జబల్పూర్ లో జరిగిన ఖేలో ఇండియా జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొన్నాడు. ప్రకాశం జిల్లా ఈదర, కర్నూలు, మొదలైన చోట్ల రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీలలో పాల్గొని బంగారు పతకాలు సాధించాడు. వ్యవసాయ కుటుంబం నుండి వచ్చిన సూరి నాయుడు అంతర్జాతీయ స్థాయి ఖో ఖో పోటీలలో స్థానం సాధించటం చాలా గర్వంగా ఉందని కోచ్, పిఇటి, రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారాంరెడ్డి అన్నారు. ఒకేసారి ఆంధ్రప్రదేశ్ నుండి అంతర్జాతీయ స్థాయి ఖో ఖో కోచ్‌గా నక్కా ఆవులయ్య, క్రీడాకారులుగా రేజేటి సూరి నాయుడు, విశాఖపట్నం జిల్లా అనకాపల్లికి చెందిన హేమావతి ఎంపికవటం సంతోషంగా ఉందని అన్నారు. ఖోఖో క్రీడకు ఎంతో సహాయ సహకారాలు అందించిన పంగులూరు గ్రామ పెద్దలు, చైర్మన్ బాచిన చెంచుగరటయ్య, చీఫ్ ప్యాట్రాన్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, వైసిపి ఇన్చార్జి బాచిన కృష్ణ చైతన్య, రాష్ట్ర అధ్యక్షులు టిఎస్ఆర్‌కె ప్రసాద్, రిఫరీస్ బోర్డు కన్వీనర్ ఎంవిఎస్ఎస్ ప్రసాద్, మాగుంట చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, జిల్లా ఖో ఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భాస్కరరావు, కాశీ విశ్వనాథరెడ్డి అభినందించారు.

క్రీడాకారిణి హేమావతి

నివాళులర్పిస్తున్న నాయకులు

మహమ్మద్ ఖాన్‌కు నివాళి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా ఎలక్ట్రికల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ వర్కర్స్ యూనియన్ సభ్యులు టీవీ మెకానిక్ పఠాన్ మహమ్మద్ ఖాన్(గోరె)కు పలువురు నివాళులర్పించారు. మహమ్మద్ ఖాన్ శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన పార్థీవ దేహాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపాన్ని సానుభూతిని తెలియజేశారు. అనంతరం రూ.11 వేల ఆర్థిక సాయం కుటుంబ సభ్యులకు అందజేశారు. మహమ్మద్ ఖాన్‌కు నివాళులర్పించిన వారిలో ఎలక్ట్రానిక్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి జి. శ్రీనివాసులు, యూనియన్ నాయకులు పివి. శేషయ్య. బి.రాజు. కోనంకి చిరంజీవి, ఎన్‌వి.సుబ్బారావు, ఎం.శ్యాముల్, తంబి అన్న. శివ పార్వతి, శ్రీను, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వై. సిద్ధయ్య, జాలా అంజయ్య. ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మహమూద్ అబ్దుల్, నగర ప్రముఖులు డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు యుటిఎఫ్ నాయకులు శ్రీనివాసరావు, నగర అభివద్ధి కమిటీ కార్యదర్శి టి.భక్త సింగ్ రాజు, జలీల్, న్యాయవాది కరిముల్లా, ప్రజాశక్తి కురిచేడు విలేకరి పఠాన్ రహంతుల్లా తదితరులు ఉన్నారు.

సాగర్ కాలువల్లో పేరుకుపోయిన నాచు

- తగ్గిన నీటి ప్రవాహం
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-చీమకుర్తి

ఈ ఫొటోలో కనిపిస్తున్నది పాడుబడిన బావి కాదు. రామతీర్థం రిజర్వాయర్ క్రింద ఒంగోలు బ్రాంచి కాలువలో ఏపుగా పెరిగిన నాచు మొక్కలు. కాలువలో నీటి ప్రవాహానికి, కాలుష్యానికి నాచు మొక్కలు ఆటంకంగా మారాయి. కాలువలు శుభ్రం చేసి నీటిని వదలాల్సిన రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉంది. ప్రతి ఏడాది సాగర్ కాలువల ద్వారా ఖరీఫ్, రబీ పంటలు, తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేశారు. ప్రతి ఏడాది ప్రభుత్వం వేసవిలో కాలువలను శుభ్రం చేయిస్తుంది. కాలువ గట్లుపై ఉన్న చెట్లను తొలగించి, కాలువ గట్లకు మరమ్మతులు చేయించడం ఆనవాయితీ. అయితే గత నాలుగేళ్లుగా కాలువల మరమ్మతుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. నిధులు కేటాయించ లేదు. ఫలితంగా కాలువలు నాచు మొక్కలు, పిచ్చి మొక్కలతో నిండిపోయింది. కాలువ గట్లకు కొన్ని చోట్ల మరమ్మతులు చేయాల్సి ఉంది. ప్రభుత్వం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడం కాలువలు కునారిల్లుతున్నాయి. రామతీర్థం రిజర్వాయర్ క్రింద ఒంగోలు బ్రాంచి కాలువలో రెండు మీటర్ల ఎత్తున నాచు మొక్కలు పెరిగాయి. కాలువ గట్లపై చిల్లచెట్లు ఏపుగా పెరిగాయి. వాటి కారణంగా నీరు వదిలినపుడు కాలువలో నీరు మట్టం పెరుగుతోంది. నీటి ప్రవాహం వేగం తగ్గుతోంది. ఇటీవల వినాయక చవితి సందర్భంగా ప్రజలకు సాగర్ కాలువల్లోనే విగ్రహాలను నిమజ్జనం చేశారు. అవి కాలువలో నీటి సరఫరాకు అడ్డంకిగా మారాయి.ఈ నేపథ్యంలో జిల్లా సరిహద్దు బుగ్గ నుంచి 5 టిఎంసిల నీటి శనివారం కిందకు వదిలారు. దర్శి బ్రాంచి కాలువకు 1 టిఎంసి, రామతీర్థం రిజర్వాయర్‌కు 1 టిఎంసి నీరు వదిలారు. ఈ నీరు రామతీర్థం రిజర్వాయర్‌కు మరో వారం రోజులలో చేరే అవకాశముంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలలో పేరుకు పోయిన నాచు మొక్కలు, ఇతర వ్యర్థ పదార్థాలను తొలగించి, నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

పిచ్చి మొక్కలతో మూసుకు పోయిన కాలువ

నాచు మొక్కలతో నిండిపోయిన సాగర్ కాలువ

హరిబాబు మృతి పార్టీకి తీరని లోటు : వరికూటి

ప్రజాశక్తి-టంగుటూరు

వైసిపి జిల్లా యువ నాయకులు, పారిశ్రామికవేత్త, టంగుటూరు జడ్‌పిటిసి ప్రతినిధి మన్నం హరిబాబు (46) మతి వైసిపికి తీరని లోటుఅని వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు, వైసిపి కొండపి నియోజక వర్గ మాజీ సమన్వయకర్త డాక్టర్ మాదాసి వెంకయ్య తెలిపారు. గత కొద్ది రోజులుగా అనార్యోగంతో బాధపడుతున్న మన్నం హరిబాబు ఆదివారం హఠాత్తుగా గుండెపోటుతో మృతిచెందాడు. ఎప్పుడూ హుషారుగా ఉండే హరిబాబు చిన్న వయసులోనే మరణించడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్తులను తీవ్రంగా బాధించింది. గడిచిన స్థానిక సంస్థల ఎన్నికలలో మన్నం హరిబాబు భార్య మన్నం రాధ ఎం.నిడమలూరు సర్పంచి అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. అనంతరం నిర్వహించిన జడ్‌పిటిసి ఎన్నికలలో హరిబాబు సోదరుడి భార్య మన్నం అరుణకుమారి విజయం సాధించారు. ఈ విజయంలో హరిబాబు కషి ఎంతో ఉంది. వైసిపి జిల్లా నాయకులు, మండల నాయకులతో హరిబాబుకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. మన్నం హరిబాబు భౌతికాయాన్ని ఎం. నిడమనూరు లోని ఆయన స్వగహంలో గ్రామస్తుల సందర్శనార్థం ఉంచారు. సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. హరిబాబు మృతదేహాన్ని వైసిపి కొండపి నియోజక వర్గ వరికూటి అశోక్ బాబు, వైసిపి కొండపి నియోజక వర్గ మాజీ సమన్వయకర్త డాక్టర్ మాదాసి వెంకయ్య, జడ్‌పిటిసి మన్నం అరుణ కుమారి, న్యాయవాది మన్నం వెంకటేశ్వర్లు, వైసిపి మండల అధ్యక్షుడు మల్లవరపు రాఘవరెడ్డి, సిపిఎం నాయకులు వేశపోగు మోజెస్, ఉప సర్పంచి కాకుమాని సుబ్బారావు, రావూరి ప్రవీణ్ కుమార్, మన్నం వెంకయ్య, ఏకా ప్రభాకర్, వైసిపి నాయకులు, కార్యకర్తలు సందర్శించి నివాళులర్పించారు.

నివాళులర్పిస్తున్న వరికూటి అశోక్‌బాబు.

29న రాజకీయ సదస్సు

ప్రజాశక్తి-శింగరాయకొండ

యానాదులకు చట్టసభల్లో రాజకీయ ప్రాతినిథ్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న ఒంగోలులో రాజకీయ సదస్సు నిర్వహి స్తున్నట్లు యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెసి. పెంచలయ్య తెలిపారు. స్థానిక టిపినగర్‌లో యానాదుల సంక్షేమ సంఘం, యానాది గిరిజన ఉద్యోగుల సంఘం ముఖ్య నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమా వేశంలో యానాదులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. యానాదులు అధికంగా ఉన్న ఐదు అసెంబ్లీ స్థానాలను యానాదులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఒంగోలు జిల్లాకు సంబంధించి కందుకూరు అసెంబ్లీ స్థానాన్ని యానాదులకు కేటాయించాలని కోరారు. యానాదులకు ఎమ్మెల్సీ, ప్రత్యేక కార్పొరేషన్ ఇవ్వాలన్నారు. ఎస్‌సి కమిషన్‌లో యానాదులకు చోటు కల్పించాలన్నారు. న్యాయం చేసే పార్టీలకే వచ్చే ఎన్నికల్లో యానాదుల మద్దతు ఉంటుందన్నారు. ఒంగోలు లోని గిరిజన కార్యాలయంలో యానాదుల కోసం ప్రత్యేక ఆధార్ నమోదు కార్యాలయంలో ఏర్పాటు చేయాల న్నారు. ఈ కార్యక్రమంలో యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎందేటి వెంకట సుబ్బయ్య, రాష్ట్ర కోశాధికారి, కొండపి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాపూరి ప్రభావతి, యానాది గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చేవూరు సుబ్బారావు, ఒంగోలు జిల్లా అధ్యక్షుడు కొమరగిరి మాల్యాద్రి, పిట్ల భాస్కర్‌రావు, నాగరాజు, దుర్గాప్రసాద్, యాటగిరి ప్రసాదరావు, కత్తి ప్రసాద్, ఎందేటి మురళీ, చెంబేటి ఉష, కల్లూరు వరలక్ష్మి, మల్లవరపు సీత, రాధ, రమణ, మాకాని హనుమంతరావు, ఉమాపతి, చలంచర్ల పెద బ్రహ్మయ్య, చిన బ్రహ్మయ్య, శివన్నారాయణ. వెంకట్రావు, చేవూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

అర్ధనగ్న ప్రదర్శ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి నాయకుల అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి-కొండపి

రాష్ట్రంలో వైసిపి అరాచక పాలన సాగుతుందని, దాన్ని తరిమి కొట్టే రోజులు దగ్గరోనే ఉన్నాయని కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి తెలిపారు. మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు అరెస్టును ఖండిస్తూ టిడిపి మండల అధ్యక్షుడు బి. యలమందనాయుడు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ దీక్షల్లో నేతివారిపాలెం గ్రామ టిడిపి నాయకులు పాల్గొన్నారు. తొలుత చేతులకు సంకెళ్లు వేసుకొని అర్ధనగ్న ప్రదర్శనలో వినూత్న రీతిలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం యువత, రైతులకు తీవ్ర అన్యాయం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నరసారెడ్డి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, టిడిపి యూత్ మండల అధ్యక్షుడు ఖాలేషా, గుండపనేని రామూర్తినాయుడు, దామా మురళి, బి.విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు. **నాగులుప్పలపాడు :** మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా టిడిపి బాపట్ల పార్లమెంట్ బిసి సెల్ ప్రధాన కార్యదర్శి కె.సెల్వం ఒక్క రోజు మౌన నిరహారదీక్ష ఆదివారం నిర్వహించారు. మండలత పరిధిలోని ఉప్పుగుండూరు బస్టాండ్ కూడలి వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మౌననిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సెల్వం మాట్లాడతూ చంద్రబాబు నాయుడు జైలు నుంచి బయటకు రాకుండా ఏశక్తి ఆపలేదన్నారు. అనంతరం టిడిపి సీనియర్ నాయకులు గోగినేని ఆంజనేయులు సెల్వంకు నిమ్మరసం అందజేసి మౌన నిరాహార దీక్షను విరమింప జేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కనగాల శ్రీనివాసరావు, గుమ్మడి వెంకటేశ్వర్లు, జాన్సన్, పాలపర్తి బాలకోటి పాల్గొన్నారు.

అనుమతి లేకుండా పొగాకు 'బ్యారెన్లు'

ముడుపుల మత్తులో అధికారులు

ప్రజాశక్తి-టంగుటూరు

మండలపరిధిలోని పలు గ్రామాలలో అనధికారికంగా పొగాకు బ్యారెన్లు నిర్మిస్తున్నారు. పట్టించుకోవాల్సిన బోర్డు అధికారులు ముడుపుల మత్తులో తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరిస్తున్నారు. టంగుటూరు పొగాకు బోర్డు పరిధిలోని కాకుటూరువారిపాలెం గ్రామంలో ఆర్‌అండ్‌బి రహదారిని ఆనుకొని ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా 7 బ్యారన్ల అక్రమంగా నిర్మిస్తున్నారు. అయినప్పటికీ అధికారులు ఆవైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. రెండేళ్లుగా పొగాకు ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. దీంతో భూముల కౌలు, బ్యారన్ల లీజు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. గతంలో రూ.30 నుంచి 40 వేలు ఉన్న బ్యారన్ లీజు ప్రస్తుతం రూ 1.5 లక్షలు పలుకుతోంది. అంత లీజు చెల్లించడం కంటే కొత్త నిర్మిస్తే లాభాదాయమని భావించిన కొందరు ఎలాంటి అనుమతులు, లైసెన్సులు లేకుండా అక్రమంగా బ్యారెన్లు నిర్మిస్తున్నారు. లైసెన్స్ ఉన్న బ్యారన్ల రెన్యువల్ వారం ఆలస్యమైనా ముక్కు పిండి వసూలు చేసే బోర్డు అధికారులు, అక్రమంగా నిర్మిస్తున్న బ్యారెన్ల విషయంలో ఎందుకంత ఉదాసీనంగా వ్యవ హరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇక్కడ అక్రమంగా నిర్మిస్తున్న 7 బ్యారన్లలో రెండింటికి మాత్రమే లైసెన్స్ ఉండగా మిగిలినవాటికి ఎలాంటి అనుమతులు లేకుండానే అధికార పార్టీ అండతో నిర్మిస్తున్నారు. ఇప్పటికైనా బోర్డు అధికారులు స్పందించి మాటలు, ప్రకటనలతో కాకుండా అనధికార బ్యారన్ ల నిర్మాణాలను నిలుపుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై టంగుటూరు పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావును వివరణ కోరెందుకు ప్రయత్నించినప్పటికీ ఆయన స్పందించక పోవడం గమనార్హం.

అనుమతులు లేకుండా నిర్మిస్తున్న పొగాకు బ్యారెన్

ఎస్‌పిని అభినందిస్తూ కేక్ కట్ చేస్తున్న డిఎస్‌పి ప్రసాదరావు

ఎస్‌పికి అవార్డు పట్ల హర్షం

ప్రజశక్తి - చీరాల

బాపట్ల జిల్లా ఎస్పీ, ఒంగోలు జిల్లాలకు నేషనల్ పోలీస్ అవార్డు అందుకోవటం హర్షనీయమని డిఎస్పి ప్రసాదరావు అన్నారు. స్థానిక డి ఎస్పీ కార్యాలయంలో ఎస్పీకి అవార్డు రావడం పట్ల అనందాన్ని వ్యక్తం చేస్తూ సామాజిక కార్యకర్త తేళ్ళ రాంబాబు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్బంగా డిఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ బాపట్ల జిల్లాకు దేశంలోనే గుర్తింపు తీసుకురావటం ఎంతో గర్వకారణం అన్నారు. విధి నిర్వహణలో జిల్లా ఎస్పీ వాకుల్ జిందాల్‌కు జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు రావటం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్నో అవార్డులు అందుకుని ఉన్నత ఉద్యోగ బాధ్యతలు స్వీకరించాలనిఆకాంక్షించారు. కార్యక్రమంలో టూ టౌన్ సిఐ సోమశేఖర్, ఈపురపాలెం ఎస్సై జనార్ధన్, వేటపాలెం ఎస్సై సురేష్, ఒకటవ పట్టణ ఎస్సై జానీ భాష, జెఎసి నాయకులు మార్క్ పాల్గొన్నారు.

విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న డి చక్రపాణి

శంకరన్ చరిత్ర పాఠ్యాంశాల్లో చేర్చాలి

ప్రజాశక్తి - బాపట్ల

ఐఎఎస్ అధికారిగా ప్రజలకు వినూత్న సేవలందించిన ఎస్ఆర్ శంకరన్ జీవిత చరిత్రను ప్రభుత్వం పాఠ్యపుస్తకాల్లో పొందుపరచాలని మానవ వనరుల అభివృద్ధి సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ జనరల్ డి చక్రపాణి అన్నారు. శంకరన్ 13వ వర్ధంతి సందర్భంగా ఫోరం ఫర్ బెటర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఆదివారం నిర్వహిం చిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ ఎస్ఆర్ శంకరన్ ఐఎఎస్ అధికారిగా ఐఎఎస్ పదవికే వన్నెతెచ్చారని అన్నారు. శంకరన్ జీవిత చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన బీకాం మొదటేడాది విద్యార్థిని ఎన్ నిఖిత, ద్వితీయ బిఎ విద్యార్థిని డి ఇందుమతిలకు శంకరన్ పతకాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె మాల్యాద్రి, ఫోరం కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు పాల్గొన్నారు.

వైద్యులను సన్మానిస్తున్న రోటరీ ప్రతినిధులు

రోటరీ వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజశక్తి - చీరాల

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక రోటరీ సామాజిక భవనంలో ఒంగోలు స్మార్ట్ విజన్ కంటి హాస్పిటల్, చైతన్య కార్డియాక్ సెంటర్ సహకారంతో ఆదివారం ఉచిత కంటి, గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంకు డాక్టర్ బి నాగ మాధురి, డాక్టర్ కృష్ణచైతన్య బృందం పర్యవేక్షణలో 110మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సమస్యల ఉన్న వారు ఒంగోలు హాస్పిటల్‌కి వస్తే అత్యాధునిక పరికరాలతో ట్రీట్మెంట్ యిచ్చి, ఫీజులో 30శాతం రాయితీ యిస్తామని అన్నారు. కార్యక్రమంలో మామిడాల శ్రీనివాసరావు, పోలుదాసు రామకృష్ణ, జివై ప్రసాద్, డివి సురేష్, ఎంవి రామారావు, వలివేటి మురళీకృష్ణ, డాక్టర్ ఐ బాబూరావు, లక్ష్మి ప్రతాప్, చిన్ని లీలాధరరావు, పూర్ణచంద్రరావు, హరినారాయణ, మోహనరావు పాల్గొన్నారు.

పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి : ఎమ్మెల్యే

- గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో 3వ స్థానం
- వైసిపి గెలుపుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలి
- అభివృద్ధి, సంక్షేమంను ప్రతి ఇంటింటా వివరించాలి
- ఎంఎల్‌ఏ కోన రఘుపతి

ప్రజాశక్తి - కర్లపాలెం

వైసిపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి లబ్ది జరిగిందని ఎంఎల్ఎ కోన రఘుపతి అన్నారు. పంచాయతీలోని గణపవరం రోడ్డు నుండి లంక కాల్వ కట్ట వరకు గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమం 150వ రోజు ముగింపులో భాగంగా వైసిపి నాయకులతో కలిసి ప్రతి ఇంటికి తిరిగి సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ

గడప గడపకు ప్రభుత్వ కార్యక్రమంలో ఎంఎల్యే రఘుపతి

పథకాలు ప్రతి ఒక్కరికి అందిస్తూన్నారని అన్నారు. సచివా లయం, వాలంటరీ వ్యవస్థను ఏర్పాటు చేసి ఎంతోమంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని అన్నారు. ప్రతి కుటుంబానికి లబ్ది చేకూర్చిన సిఎం జగన్‌ను మరోసారి గెలిపించుకోవాలని అన్నారు. గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో జిల్లాలో మూడో స్థానం లభించిందని అన్నారు. బాపట్ల జిల్లా అభివృద్ధి కావడానికి సిఎం జగన్మోహన్‌రెడ్డి సహకరించారని అన్నారు. దగ్గరలోనే వైద్య కళాశాలను ఏర్పాటు చేశారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్క లలిత కుమారి, జడ్పిటిసి పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ పటాన్, ఎంపిటిసి ఆసిఫ్ ఆలీ, కో ఆప్షన్స్ సభ్యులు అమీర్ బేగ్, జిల్లా కార్యదర్శి మందపాటి పరమానంద కుమార్, నాయకులు పేరాల వెంకట సురేష్, పులుగు లక్ష్మారెడ్డి, సెలగల ధర్మేంద్ర, బావున్నారాయన, షేక్ సుభాని పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో నిలిచిన నిర్మాణాలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు వసతులు లేక నిలిచిపోయాయి. భట్టిప్రోలు, ఐలవరం, కోనేటిపురం, పల్లెకోన, పెదపులివర్రు గ్రామాల్లో జగనన్న కాలనీలో కనీస వసతులైన రహదారులు, త్రాగునీరు సౌకర్యంలేదు. దీంతో లబ్ధిదారులు గృహ నిర్మాణాలను నిలిపివేశారు. పేదలకు నివేసిన స్థలాలు కేటాయించి సుమారు మూడేళ్ల గడిచినా నేటికి అధికారులు, పాలకులు ఈ కాలనీలో ఎలాంటి వసతులు కల్పించలేదు. కనీస సౌకర్యాలు లేని కారణంగా పూర్తిస్థాయిలో గృహ నిర్మాణాలను చేపట్టలేకపోతున్నామని లబ్ధిదారులు వాపోతున్నారు. భట్టిప్రోలు జగనన్న కాలనీ స్వతహాగానే లోతట్టు ప్రాంతం కావడం, కాలనీకి ఇరువైపులా ఉన్న సాగు భూమికి వచ్చే సాగునీరు కాలనీని చుట్టుముడుతుంది. సరైన రహదారులు లేక నీటిలో మునిగిపోయి గృహ నిర్మాణానికి అవసరమైన మెటీరియల్ కూడా చేరే పరిస్థితి లేదు. ఇప్పట్లో నిర్మాణ పనులు చేపట్టలేమని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. ఇక్కడ నివేశన స్థలాలు మంజూరు చేసిన వారిలో ఇప్పటివరకు 300 గృహాలకు మించి నిర్మాణ పనులు చేపట్టలేదు. అధికారుల ఒత్తిడితో నిర్మాణ పనులు చేపట్టినా ప్రభుత్వం అందించే రూ.1.80లక్షల బిల్లులు ఎటు సరిపోవటం లేదని చెబుతున్నారు. ఈ బిల్లులు బేస్ బేస్మెంట్‌కు కూడా చాలటం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి గృహ నిర్మాణం పూర్తి చేసుకుందామనుకున్నా ఇక్కడ కనీస వసతులు లేకపోవడంతో అప్పులు చేసి నిర్మించినా ఇళ్లలో

రోడ్లు లేకుండా బురదలో అసంపూర్తిగా జగనన్న కాలనీలు

ఉండే పరిస్థితి కనిపించడంలేదని అంటున్నారు. అలాంటప్పుడు ఇల్లు కట్టుకున్నా అప్పుల పాలవడం తప్ప ప్రయోజనం లేదని చెబుతున్నారు.

ప్రతివారం గృహ నిర్మాణాలపై ఉన్నతాధికారుల సమీక్షలు

వసతుల లేమి, వర్షాకాలం కావడం వలన జగనన్న కాలనీలో లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేపట్టలేకపోతున్నారు. కానీ ఉన్నతాధికారులు మాత్రం ప్రతివారం క్షేత్రస్థాయి అధికారులకు టార్గెట్లు ఇచ్చి ప్రోగ్రెస్ రిపోర్టును అడుగుతూనే ఉంటున్నారు. ఒక దశలో గృహాలు నిర్మించని వారి పట్టాలను కూడా రద్దు చేయాలని ఆలోచనతో నోటీసులు కూడా జారీ చేశారు. మంజూరు చేసిన పట్టాలలో అధిక శాతం ఎక్కడ సెంటు భూమి లేని నిరుపేదలే ఉన్నారు. వారికి గృహ నిర్మాణం అవసరమే. కానీ బాగాలేని భూముల్లో ఇచ్చిన ఈ స్థలాలకు కనీస రహదారులు, త్రాగునీరు సౌకర్యం, మెరక లేకుండా ఏ విధంగా గృహ నిర్మాణం చేపట్టాలంటూ లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. వర్షాలు పూర్తిగా తగ్గి జనవరి నెల వరకు కూడా ఎలాంటి కట్టడాలు చేపట్టే పరిస్థితి కనిపించడం లేదు. క్షేత్రస్థాయి అధికారులతో పాటు ఉన్నతాధికారులకు కూడా మస్య తెలుసని చెబుతున్నారు. అయినప్పటికీ ప్రభుత్వ ఆదేశాను సారం ఎవరి పని వారు చేయక తప్పటం లేదని అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు.

గృహ నిర్మాణానికి బిల్లులు మూడు లక్షలకు పెంచాలి

లోతట్టు ప్రాంతంగా ఉన్న జగనన్న కాలనీలో గృహ నిర్మాణానికి ప్రస్తుతం ఇచ్చే బిల్లు చాలాటం లేదని, దీనికి అదనంగా మరో రూ.3లక్షల వరకు ప్రభుత్వం పెంచితే తప్ప ఇల్లు నిర్మించుకోలేమని లబ్ధిదారులు అంటున్నారు. ప్రభుత్వ విధానం ప్రకారం స్థలం ఇచ్చి ఇల్లు కూడా నిర్మిస్తామనే హామీ నుండి వెనక్కు తగ్గిన కారణం బిల్లులు సరిపోవనే ఉద్దేశమే కదా? అలాంటప్పుడు లబ్ధిదారులు స్వయంగా నిర్మించుకుంటే ఏవిధంగా సరిపోతాయని ప్రశ్నిస్తున్నారు. ఐలవరంలో గిరిజనుల (యానాది) కుటుంబాలకు కేటాయించిన స్థలాల్లో ఏదో ఒక సంస్థ ఒప్పందంతో నిర్మాణాలు చేపట్టకపోతే ఇక్కడ ఇల్లు కూడా నిర్మాణం చేపట్టే పరిస్థితులు కనిపించడం లేదు. పొలాల కాపలాగా ఉంటూ, ఎలుకలు పట్టుకొని బ్రతుకు తెరువు సాగించే యానాదులు అప్పు చేసి ఇళ్లు కట్టుకునే స్తోమత లేదని అంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జగనన్న కాలనీలో గృహ నిర్మాణాల లక్ష్యం ఏ మేరకు నెరవేరుతుంది అనేది ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై ప్రభుత్వమే విధానపరమైన చర్యలు చేపట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

మురుగుకు పరిష్కారం ఏదీ?

ప్రజాశక్తి - భట్టిప్రోలు

గ్రామంలో మురుగుపారుదల సమస్య తీవ్రంగా పట్టిపీడిస్తోంది. గ్రామంలోని 8, 9వార్డుల్లో ఇటీవల వర్షపు నీరు నిలబడి దోమల వృద్ధి చెంది గ్రామస్తులకు అంటువ్యాధులు ప్రబలి తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇలాంటి తరుణంలో జిల్లా పంచాయతీ, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాన్ని సందర్శించి పరిశీలించారు. తక్షణమే మురుగునీటిని బయటకు తరలించేందుకు చర్యలు చేపట్టాలని పంచాయ తీ అధికారులను ఆదేశించగా పంచాయతి అధికారులు నిధులు ఖర్చు చేశారు. ఆయిల్ ఇంజన్లు, జెసిపితో కాలువ తవ్వకం వంటి పనులు చేపట్టారు. దీనికిగాను రూ.60వేల నుండి రూ.80వేల వరకు ఖర్చయినట్లు సమాచారం. ఎంత ఖర్చు చేసినా సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. వారం రోజులపాటు ఆయిల్ ఇంజన్లతో నీటిని బయటకు తరలించారు. మళ్లీ తిరిగి యధావిధిగా అనే మురుగు కొనసాగుతుంది. ఇప్పటికీ గృహాలను చుట్టుముట్టడంతో అనేకమంది ఇల్లు వదిలి వెళ్లిన సంఘటనలు ఉన్నాయి. అధికారుల పరిశీలన సమయంలో ఎనిమిదవ వార్డులో నిల్వ ఉన్న నీటిని బయటకు తరలించేందుకు అడ్డుగా ఉన్న రహదారులకు తూములు ఏర్పాటు చేసి తద్వారా ఏట

ఇళ్లమధ్యలో నిలిచిన మురుగునీళ్లు

వాలుగా నీరు బయటకు వెళ్లే ప్రాంతానికి మళ్లించాలని ఉన్నతాధికారులు సూచించారు. కానీ పంచాయతీ అధికారులు ఎక్కడ ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించిన దాఖలాలు లేవు. ఈ రెండు వార్డులకు అనుకుని ఉన్న వెల్లటూరు ఛానల్ కాలువ వెంబడిలో ఉన్న నీటిని మాత్రమే జెసిబి, ఆయిల్ ఇంజన్ల ద్వారా బయటికి మళ్ళించే ప్రయత్నం చేశారు. కానీ లోపల సిసి రహదారుల మధ్యలో గృహాలు చుట్టూ ఉన్న నీరు మాత్రం ఎటు కదలకుండా అలాగే ఉండిపోయింది. దీంతో గృహాలు చుట్టూ మురుగునీరు దుర్వాసన వెదజల్లుతూ దోమలు వృద్ధికి కారణమవుతుందని గ్రామస్తులు అంటున్నారు. ఇంత పని చేసిన ఏమాత్రం ప్రయోజనం లేకుండా పోయిం దని ఆ ప్రాంతవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిపిఒ రాంబాబు దాదాపు మూడు, నాలుగు పర్యాయాలు గ్రామంలో పర్యటించారు. మురుగుపారుదల వ్యవస్థపై అనేక విధాల సమీక్షించారు. పరిష్కారం కోసం పంచా యతీ నిధులు వెచ్చించారు. ఆ నిధులు దుర్వినియోగం అయ్యాయే తప్ప ఏమాత్రం ప్రజలకు ఉపయోగం లేదని ఆరోపిస్తున్నారు. ఇది ఇలా ఉండగా ఈ రెండు వార్డులతోపాటు గ్రామంలో నెలకొన్న ఇతర ప్రాంతాలలోని మురుగు నీటిపారుదలకు ప్రణాళి కాబద్ధంగా చర్యలు తీసుకుంటే తప్ప ఎప్పటికీ ఈ సమస్య పరిష్కారం అయ్యే మార్గం కనిపించడం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. దీనికి శాశ్వత పరిష్కారం పక్కా డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో సుమారు 40కుటుంబాలకుపైగా మురుగు కూపంలో ఉండటమే కాక గిరిజన వాసులు కూడా ఉండటం వలన అధికారులు, ప్రజాప్రతిదులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణ వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి మురుగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

వినూత్నంగా టిడిపి నిరసన దీక్షలు

ప్రజాశక్తి - అద్దంకి

చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా పట్టణంలో రిలే నిరాహార దీక్షలో 26వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ఒకటవ వార్డు నుండి 5వ వార్డులోని టిడిపి నాయకులు, కార్యకర్తలు దీక్షలో కొనసాగారు. మాజీ జడ్పిటిసి సందిరెడ్డి శ్రీనివాసరావు, భయపనేని హనుమంతరావు, గోవాడ శ్రీకాంత్, నాగరాజు, దామా పూర్ణచంద్రరావు, చప్పిడి వీరయ్య, బొడ్డపాటి ఆదిత్య, వంటేల గంగాధర్, మురకొండ శ్రీధర్, పచ్చవ సునీల్, మాగులూరి తిరుపతమ్మ, ధూళిపాళ్ల వెంకటరత్నం, గడ్డం రాజేష్, గురజాల వెంకటేష్ దీక్షలో కొనసాగారు. మన్నం త్రిమూర్తులు, నాగినేని రామకృష్ణ దీక్షపరులకు కండువాలు వేసి దీక్షను ప్రారంభించారు. బాల బాలికలు నందమూరి కళాపరిషత్ ఆధ్వర్యంలో చట్టం సమాజంను అంశం మీద పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రావిపాటి శరణ్య, కాకుమాని ప్రదయ్ కుమార్, బత్తుల షణ్ముఖ, కరువది విరాట్ పాల్గొన్నారు. రావిపాటి శరణ్య అను చిన్నారి ఇంగ్లీషులో చక్కగా మాట్లాడి అక్కడ ఉన్న దీక్ష పరులను ఆశ్చర్య పర్చారు. ఆరు సంవత్సరంల బాలుడు కాకుమాని ప్రధయ్ కుమార్ నినాదాలు చేశారు. చిన్నారులంతా పాటలకు డాన్స్ వేయగా దీక్షపరులు ఆనందం వ్యక్తం చేశారు. బాల బాలికలకు షేక్ ఖాసిం సాహెబ్, పటాన్ పజ్జులుల్లా చేతుల మీదుగా లామినేషన్స్ అండ్ గిఫ్ట్ బహుకరించారు. కార్యక్రమంలో హనుమంతరావు, గోవాడ శ్రీకాంత్, గార్లపాటి శ్రీనివాసరావు, బచ్చల వాసు, మల్లాది వెంకట రత్తయ్య, వడ్డవల్లి పూర్ణ, కాకాని అశోక్, కట్ట ప్రతాప్, మల్లాది శ్రీనివాసరావు, నర్రా గోపాల్, ఎన్ఎస్పి సుబ్రహ్మణ్యం, వేముల నాగేశ్వరరావు, షేక్ కరిముల్లా, షేక్ మహబూబ్ పాల్గొన్నారు.

రేపల్లె : చంద్రబాబు అరెస్టు అప్రజాస్వామికమని టీడీపీ నాయకులు ధ్వజమెత్తారు. సామూహిక నిరాహార దీక్షలు ఆదివారం 25వ రోజుకు చేరాయి. రిలే దీక్షలో నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి, రేపల్లె మండలాలకు చెందిన టీడీపీ నేతలు దీక్షలలో పాల్గొన్నారు. ఈ దీక్షలో అనగని శివప్రసాద్, పరిశా నాగకిషోర్, యామినేని నరసింహ, పడమటి నందీశ్వర రావు, పరిశా ఇందిరమ్మ, నర్రా వెంకటేశ్వరరావు, యామినేని నాగబాబు, గోలి శేషు ఎన్ రాంబాబు, ఆరేపల్లి నాగబాబు, పుసులూరి కోటేశ్వరరావు, పరిశ పావని, సొంటి నాగేంద్ర, కాటూరి నాగమణి, కేసన తిరుపతమ్మ పాల్గొన్నారు.

బాపట్లలో టిడిపి నేతల నిరసన దీక్షలు

బాపట్ల : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా టిడిపి ఇంచార్జి వేగేశన నరేంద్ర వర్మ ఆధ్వర్యంలో స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. దీక్షలో తాతా జయప్రకాష్ నారాయణ, ముక్కామల శివ, ఏపూరి భూపతిరావు ,భవనం బసివిరెడ్డి, రావి సుందరారెడ్డి, బొద్దుకూరి విజయ పాల్గొన్నారు.

చెరుకుపల్లి : చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని అమృతలూరులో రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. దీక్షలనుద్దేశించి మాజీ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడారు. అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపిన ఈ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. అత్యుత్సాహం చూపుతున్న అధికారులకూ గుణపాఠం చెబుతామని అన్నారు.

కారంచేడులో తెలుగు మహిళల నిరసన ర్యాలీ

కారంచేడు : చంద్రబాబు అక్రమ అరెస్టును వ్యతిరేకిస్తూ టిడిపి ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసన దీక్షలు ఆదివారంతో 30వ రోజుకు చేరాయి. టిడిపి మండల అధ్యక్షులు తిరుమల శెట్టి శ్రీహరి, ఎఎంసి మాజీ ఛైర్మన్ యార్లగడ్డ అక్కయ్య చౌదరి, నాగేశ్వరరావు, మందలపాటి సుబ్బారాయుడు, చాగంటి లక్ష్మీనారాయణ, జాగర్లమూడి ప్రహ్లాదు, చాగంటి కోటేశ్వరరావు, చిన్న నారాయణ, చెన్నుపాటి శ్రీకాంత్, జాగర్లమూడి రామకృష్ణ, యార్లగడ్డ శ్రీనివాసరావు, చాగంటి సాంబయ్య, విరత్తు శ్రీనివాసరావు, సుబ్బారాయుడు, కట్ట రాజు, శంకరశెట్టి బోసు, తిరుమలశెట్టి రాజా, పోతిరి స్వరూపారాణి, నూతి నాగేంద్రం, చాగంటి రాణి, తేళ్ల ఝాన్సీ, పువ్వాడ దేవి, సర్పంచి బాలిక శివపార్వతి, యార్లగడ్డ దేవి, జొన్నకూటి ఏడుకొండలు, నీరుకట్టు సింగయ్య, కట్టిబోయిన శ్రీనివాస్, స్వర్ణ వెంకట సుబ్బారావు, దేవరపల్లి అనిల్, కాపా రఘుబాబు, గ్రామ అధ్యక్షుడు కంభంపాటి నరేంద్ర, మహిళా నాయకులు పాతూరి ఆదిలక్ష్మి, పోతిని వెంకటేశ్వర్లు, హనుమంతురావు, బొయిన శ్రీను, ఆకుల లక్ష్మి, సరసు సుధారాణి, జాన్సి, దగ్గుపాటి లక్ష్మి నాగమణి, వెంకటరత్నం, సునీతా, మల్లీశ్వరి, పూనాటి లక్ష్మణ నారయణ, బొడవుల రామచంద్రరావు, శివ, జాలయ్యా, పాతూరి శివరాం, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

చీరాలలో నిరసన దీక్షల్లో టిడిపి ఇన్‌ఛార్జి కొండయ్య

చీరాల : చంద్రబాబును రాజకీయంగా ఎదుర్కొనలేక అక్రమ అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించటం దుర్మార్గమని టిడిపి ఇంచార్జి ఎంఎం కొండయ్య అన్నారు. బాబు అరెస్టు వ్యతిరేకిస్తూ నిరసినగ టిడిపి కార్యాలయం వద్ద చేస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 26వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలలో వేటపాలెం మండలంలోని టిడిపి నాయకులు కూర్చున్నారు. నిరసన దీక్షలో పింజల వీరవేణి, సైతాల మహాలక్ష్మీ, పడవల రేణుక, పింజల సూర్యం, మాచర్ల గోవిందరాజులు, సప్పిడి సత్యవేణి, పేరక వెంకటేశ్వరమ్మ, కర్ణ కస్తూరి, మాడ శేషారత్నం పాల్గొన్నారు. బొగ్గుల పార్థసారధి, గొర్ల రాముడు, కీర్తి వెంకటేశ్వర్లు, షేక్ లాల్ అహ్మద్, కౌతరపు జనార్ధనరావు, అడ్డగడ రామయ్య, కూరపాటి పూర్ణ, తోట సాంబశివరావు, యర్రా శివనాగమల్లేశ్వరి, తేలప్రోలు నాగేశ్వరరావు, నున్న శ్రీరాం, షేక్ కరిముల్లా, షేక్ నజీర్, శిరందాసు కాళిదాసు, తుమ్మ సుభాన్ రెడ్డి, దగ్గుబాటి వెంకట్రావు, ఉసురుపాటి సురేష్, బుర్ల రోశయ్య, దుడ్డు శామ్యూల్, కొవ్వూరు శివారెడ్డి, నరాల తిరుపతి రాయుడు, గుత్తి వెంకట శివయ్య, గుమ్మ వెంకటేష్ సంఘీభావం ప్రకటించారు.

జంపని గ్రామంలో మాజీ మంత్రి నక్క ఆనందబాబు

భట్టిప్రోలు (వేమూరు) : వేమూరు మండలం జంపని గ్రామంలో చంద్రబాబు అరెస్టుకు నిరసనా ఆదివారం నిరాహార దీక్ష కొనసాగించారు. మాజీ మంత్రి, టిడిపి పోలీసు బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి అరాచక పాలన సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి అవినీతి మచ్చలేని చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. ఎన్ని అరాచకాలు సృష్టించిన ప్రజలంతా టిడిపి వైపు ఎదురుచూస్తున్నారని అన్నారు. రాను ఎన్నికల్లో టిడిపి గెలుపుతో చంద్రబాబు సిఎం కావడం ఖాయమని అన్నారు. స్కిల్ డెవలప్మెంట్ స్కాంలో ఎలాంటి ఆధారాలు లేవని అన్నారు. అలాగే అధికార పార్టీకి అండగా పోలీసులు సైతం అక్రమ కేసులకు పాల్పడుతున్నారని అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ప్రతి ఒక్కరికి తగిన గుణపాఠం ఉంటుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జొన్నలగడ్డ విజయబాబు, మైనేని మురళీకృష్ణ, కనగాల మధుసూదన్ ప్రసాద్, తూనిగుంట సాయిబాబా పాల్గొన్నారు.

అద్దంకిలో జలదీక్ష చేస్తున్న టిడిపి కార్యకర్తలు

బాబు కోసం జలదీక్ష

ప్రజాశక్తి - అద్దంకి

చంద్రబాబు అక్రమ అరెస్టు నిరసిస్తూ ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఆధ్వర్యంలో మణికేశ్వరం టిడిపి ఆధ్వర్యంలో నాయకులు గుండ్లకమ్మ నదిలో అర్ధ నగ్నంగా జలదీక్ష ఆదివారం చేపట్టారు. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించిన చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండించారు.

యద్దనపూడిలో మోకాళ్లపై మహిళల నిరసన

దున్నపోతుకు వినతి పత్రం

ప్రజాశక్తి - యద్దనపూడి

టిడిపి మహిళా అధ్యక్షురాలు బత్తుల కృష్ణవేణి ఆద్వర్యంలో దున్నపోతుకు వినతి పత్రం ఇచ్చి, మోకాళ్ళ మీద కూర్చోని నిరసన తెలిపారు. జరుగుల సంధ్య రాణీ, కె జగదీస్వేరి, ఎన్ వీరమ్మ, బి అంజమ్మ, పార్వతి, కోయ వనజ, వివిధ గ్రామాల నుండి టిడిపి కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో అనర్థాలు..

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

ప్లాస్టిక్ వ్యర్థాలతో అనర్థాలు తేటతెల్లమ వుతున్నాయి. ప్లాస్టిక్ నిషేదం ప్రకటనలకే పరిమితమైంది. ప్లాస్టిక్ కవర్ల ఉత్పత్తి తగ్గితేనే ప్లాస్టిక్ వాడకం తగ్గిపోతుంది. ప్లాస్టిక్ తయారు చేస్తున్న కంపెనీలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, ప్రభుత్వాలు వ్యాపారులపై దాడులు చేసి జరిమానాలు విధించటం పరిపాటిగా మారింది. వినియోగదారుల సౌలభ్యం కోసం వ్యాపారస్తులు ఇస్తున్న ప్లాస్టిక్ సంచులు పర్యావరణానికి ముప్పుగా మారాయి. గతంలో అన్ని గ్రామ పంచాయతీలు ప్లాస్టిక్ వినియోగంపై నిషేదం విధించారు. కొద్దిరోజులకే నిషేధం అమలుపై శ్రద్ధ చూపక పోవటంతో మరలా మొదటికే వచ్చింది. వాడిన ప్లాస్టిక్ కాగితాలతోపాటు శుభకార్యాల్లో ఉపయోగించిన వ్యర్థాలు రోడ్లపై పడేయటం వల్ల ఆయా ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లుతుంది. కొణికి, పావులూరు, భీమవరం రోడ్ల వెంట ప్లాస్టిక్ కాలుష్యం అధికంగా ఉంది. గాలికి ప్రధాన కాలువల్లో ప్లాస్టిక్ సంచులు పడి మురికి నీరు పోకుండా అడ్డంకిగా మారుతున్నాయి. వర్షాలు పడినప్పుడు వాటి ముప్పు ఏమిటో స్పష్టంగా అర్థమవుతుంది. వీటితో పాటు మద్యం సీసాలు కూడా మందుబాబులు కాలువల్లో పడేసి పోతున్నారు. వాడి పారేసిన ప్లాస్టిక్ సంచుల్లో వ్యర్థాలను పశువులు తినటం వల్ల రోగాల బారిన పడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ప్లాస్టిక్ వాడకంపై పూర్తిస్థాయిలో నిషేదం విధించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన మురుగునీటి కాలువ

ఎన్ఆర్ఐల సహకారంతో రోటరీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - రేపల్లె

గ్రామీణ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు దాతలు ముందుకు రావటం అభినందనీయమని రోటరీ క్లబ్ అధ్యక్షులు ఎంఎం సక్సేనా అన్నారు. పట్టణంలోని వీర వల్ల కోటయ్య ఫంక్షన్ హాల్లో ప్రవాసాంధ్రులు డాక్టర్ సుఖవాసి కల్యాణి, ఘంటా జయరామకృష్ణ దంపతుల ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిభిరాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సక్సేనా మాట్లాడుతూ డాక్టర్ బసవయ్య నాలుగు దశాబ్దాలుగా ప్రజలకు వైద్య సేవలు అందిచారని అన్నారు. డాక్టర్ సుఖవాసి బసవయ్యను ఘనంగా దుశ్యాలవాలతో సన్మానించారు. అనంతరం పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి వైద్య బృందం డాక్టర్ శైలజ, డాక్టర్ నీరజ క్యాంపుకు వచ్చిన గ్రామీణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 400 మందికి వైద్య పరీక్షలు చేశారు. కంటి శుక్లాలు ఉన్న వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సుఖవాసి సతీష్ బాబు, మల్లెల రామచంద్రరావు, అంబటి ప్రసాద్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

ఎరువుల దుకాణంలో తనిఖీ

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని చందలూరులోగల వెంకటరమణ ట్రేడర్స్ ఎరువుల షాపును తనిఖీ చేసి, షాపులో ఉన్న బెనివియా పురుగుల మందును పరిశీలన నిమిత్తం మూడు బాటిల్స్ శాంపిల్స్ తీసుకువెళ్తున్నామని వ్యవసాయ శాఖ ఎడిఎ శ్రీనివాసరావు తెలిపారు. తాను కొన్న బినీవియా పురుగుల మందు, మిరపపైరులో పురుగులను నివారించ లేకపోతుందని, ఇది నకిలీ మందనే అనుమానంతో ఒక మిర్చి రైతు ఫిర్యాదు చేశాడు. దీంతో ఎడిఎ శ్రీనివాసరావుతో పాటు పంగులూరు ఎఒ సుబ్బారెడ్డి ఆదివారం షాపును తనిఖీ చేశారు. షాపు యజమాని 25బాటిల్స్ తీసుకు వచ్చాడని, వాటిలో నాలుగు బాటిల్స్ అమ్మగా, ఇంకా 21బాటిల్స్ మిగిలి ఉన్నాయని చెప్పారు. మూడు బాటిల్స్‌ను ల్యాబ్‌కు పంపి, టెస్ట్ చేయించేందుకు శాంపిల్స్‌గా తీసుకెళ్తున్నామని చెప్పారు. ల్యాబ్‌లో చేసే టెస్టుల్లో మందులో ఉండాల్సిన కంటెంట్ లేకపోతే షాప్ యజమానిపై కఠిన చర్యలు తీసుకుంటా మని తెలిపారు.

కషాయం తయారీ వివరిస్తున్న పాండురంగారావు

పురుగు నివారణకు కషాయం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రస్తుతం వరి పైరును ఆశించిన నాము తెగులు, పాము పొడ, ఆకు ముడత నివారణకు కషాయమే నివారిస్తుందని ప్రకృతి వ్యవసాయ ఎంసీఎ గుర్రం పాండురంగారావు తెలిపారు. ఐలవరం, వెల్లటూరులో ఆముదం, ఉమ్మెత్త, వేప, గానుగ, సీతాఫలం ఆకులతో తయారు చేసిన కషాయాన్ని పైరుపై పిచ్చికారి చేయాలన్నారు. పసుపులో పండు ఆకు తెగులు నివారణకు చాప బెల్లంతోపాటు పుల్లటి మజ్జిగ, ఇంగవ ద్రావణం పిచికారి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిఆర్పిలు ఉన్నారు.

నీరు లేక.. పంటలు సాగక..

- వరినాట్లకు ఇక్కట్లు
- చివరి భూములకు అందని నీరు
- ఎండుతున్న నారుమళ్లు
- ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసేందుకు రైతులు దుక్కులు దున్ని సన్నద్ధమయ్యారు. వర్షాభావ పరిస్థితులు, పంట కాలువలకు సాగునీరు విడుదల కాకపోవడంతో కొంత కాలం వేసి చూశారు. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వర్షాలు పడడంతో వరినార్లు పోశారు. పంట సాగుకు అవసరమైన మేర వర్షాలు పడలేదు. మరో ప్రక్క కొమ్మమూరు కాలువకు నీటి సరఫరా తగ్గిపోయింది. దీంతో కాలువ చివరి భూములకు సాగు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వరినారు ముదిరి పోతుంది. వరినాట్లు వేసేందుకు సరిపడా నీరు లేకపోయినా గత్యంతరం లేక పొడి భూముల్లోనే నాట్లు వేస్తున్నారు. నాట్లు వేయకపోతే వరినారు ఎందుకు పనికి రాకుండా పోతుందనే ఉద్దేశ్యంతో నాట్లు వేశారు. ఆయిల్ ఇంజన్ల ద్వారా పంటను కాపాడుకునేందుకు నానా అగచాట్లు పడుతున్నారు.

మంచినీటి అవసరాల కోసం చెరువులను నింపుకునేందుకు గత జూన్‌లో కొమ్మమూరు కాలువ ద్వారా నీటిని వదిలారు. అనంతరం జలాశయాలకు నీరు చేరని కారణంగా మాగాణి సాగుకు సరిపడా నీరు ఇచ్చే పరిస్థితి లేదని, ఆరుతడి పంటలకు రైతులు సన్నద్ధం కావాలని అధికారులు చెప్పారు. పులిచింతల నుంచి కొంతమేర నీరు రావడంతో ప్రస్తుతం నీరు విడుదల చేస్తున్నారు. దీంతో జిల్లాలోని బట్టిప్రోలు, రేపల్లే, బాపట్ల ప్రాంతాల్లోని కొంత మేర మాగాణి భూములకు సాగునీరందుతోంది. కొమ్మమూరు కాలువ చివరి భూములకు నీరందే పరిస్థితి లేదు. దుగ్గిరాల లాకుల నుంచి దిగువకు ప్రాంతంలో గత నెల లోనే వరి నాట్లు కోసం రైతులు సన్నద్ధమయ్యారు. కొమ్మమూరు కాలువ పరిధిలో మాగాణి సాగు కోసం సాగునీటి విడుదల విషయమై స్పష్టత లేదు. బాపట్ల, చీరాల, చినగంజాం ప్రాంతాల్లో లక్ష ఎకరాలకు పైగా వరి సాగు అవుతుంది. ఈ నేపథ్యంలో వరి సాగుకు సిద్ధపడాలా లేక ఆరుతడి పంటలు వేసుకోవాల అనే సందిగ్ధంలో రైతులు ఉన్నారు. కొందరు రైతులు సాగు నీరు అందుతుందనే భావనతో వరినార్లు పోశారు. బోర్లు, ఆయిల్ ఇంజనతో నారును కాపాడుకున్నారు. ఇప్పుడు నాట్లు వేయాల్సి సమయం వచ్చింది. కొమ్మమూరు కాలువ చివరి భూములకు నీరందే పరిస్థితి కనిపించడం లేదు. కృష్ణా పశ్చిమ డెల్టా నీటి సామర్థ్యం 7,500 క్యూసెక్కులు. ఖరీఫ్ సీజన్‌లో ఎప్పుడూ ఆ స్థాయిలో నీటిని విడుదల చేయలేదు. 4 వేల క్యూసెక్కులు మాత్రమే విడుదల చేశారు. దీంతో చివరి భూములకు నీరు సరఫరా కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కృష్ణా పశ్చిమ డెల్టాలో 5.71 లక్షల ఎకరాల ఆయుకట్టు ఉంది. రెండు లక్షల ఎకరాలకు కూడా నీరు సక్రమంగా అందడం లేదు. గత కొద్ది రోజులుగా నీటి విడుదల తగ్గించారు. కేవలం 2,700 క్యూసెక్కులు మాత్రమే విడుదల చేస్తున్నారు. అందులో 2.50 లక్షల ఎకరాల ఆయుకట్టు ఉన్న కొమ్మమూరు కాలువకు 800 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో బాపట్ల, చీరాల, కారంచేడు, చినగంజాం మండలాల్లోని మాగాణి భూములకు నీరందే పరిస్థితి లేదు.

బోర్లు, ఆయిల్ ఇంజన్లు ఉన్న రైతులు నార్లు వేసుకుని పంట కాలువకు నీరు వచ్చాక నాట్లు వేద్దామని భావించారు. అయితే కాలువకు నీరు విడుదల కాలేదు. నాట్లు ఏపుగా పెరిగాయి. గత్యంతరం లేక రైతులు అరకొర నీటితోనే నాట్లు వేస్తున్నారు. ఆయిల్ ఇంజన్లు, బోర్లు ఉన్న రైతులు అదనంగా ఖర్చును భరిస్తూ పంటలు సాగు చేస్తున్నారు. అధికారులు వారబంధిని అమలు చేసి కాలువ చివరి భూములకు సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నీరు లేక ఎండుతున్న పైరు

మాట్లాడుతున్న జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి జయప్రకాష్

విద్యుత్ భారాలు తగ్గించాలి : జెవివి

ప్రజాశక్తి-చీమకుర్తి

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు 2022 విద్యుత్ సవరణ బిల్లు పేరుతో ప్రజలపై భారాలు మోపుతున్నాయని, ఆబిల్లును వెంటనే ఉపసంహరించరుకోవాలని జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి జయప్రకాష్ కోరారు. స్థానిక దాచూరిరామిరెడ్డి భవనంలో ఉద్యోగ, కార్మిక,ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం స్టడీ సర్కిల్ నిర్వహించారు. ఈ స్టడీ సర్కిల్‌కు విశ్రాంత ఉపాధ్యాయుడు దోమల పుల్లయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ ఈ పాటికే నిత్యావసర వస్తువుల ధరలు, డీజిల్,పెట్రోలు ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అయినప్పటికీ ప్రజలు ఇబ్బందుల గురించి పట్టించుకోకుండా వారిపై విద్యుత్ భారాలు మోపడం దారుణమన్నారు.అదనపు ఛార్జీలు,ట్రూ అప్ ఛార్జీలు, ఇతర పన్నుల పేరుతో వినియోగదారులపై భారాలు మోపడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కె. అక్బర్,చలువాది శ్రీనివాసరావు, సిఐటియు మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు, పూసపాటి వెంకటరావు, బి. ఓబులేషు, కెవిపిఎస్ మండల కార్యదర్శి తొట్టెంపూడి రామారావు, యుటిఎఫ్ నాయకులు వీరారెడ్డి,సి.హెచ్. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల షెడ్యూల్‌ను ప్రకటించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఉపాధ్యాయ పదోన్నతుల షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించాలని యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. యుటిఎఫ్ ప్రకాశం జిల్లా శాఖ విస్తృత స్థాయి కార్యదర్శివర్గ సమావేశం ఒవి.వీరారెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆగిన పదోన్నతుల షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించాలన్నారు. హైస్కూల్‌లోని ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. జిల్లాలో ఇంకా కొంత మందికి సాంకేతిక సమస్యలతో జీతాలు ఆగాయని, వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఒవి. వీరారెడ్డి, ఎస్.రవి మాట్లాడుతూ జిల్లాలో ఇంకా సగం మండలాలలో ఉపాధ్యాయులకు జీతాలు రాలేదని, జీతాలు రాక బ్యాంకుల్లో ఇఎంఐలు కట్టలేక అదనపు రుసుం చెల్లించాల్సి వస్తుందన్నారు. ఇలాంటి పద్ధతులు కొన్ని నెలలుగా పునరావృతం అవుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ముందు ప్రణాళికలో జీతాల సమస్యను లేకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు డి.వీరాంజనేయులు, కేశవ రాజు, అబ్దుల్ హై, జి.ఉమా మహేశ్వరి, చిన్న స్వామి, రాజేశ్వరరావు, జిల్లా కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిల్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరపాలక సంస్థలో విధులు నిర్వహిస్తూ చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఉపాధి అవకాశాలు చూపించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో అన్ని మస్టర్ పాయింట్ల వద్ద ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ పారిశుధ్య విభాగంలో విధులు నిర్వహిస్తూ గత నాలుగేళ్ల కాలంలో 11మంది కార్మికులు చనిపోయినట్లు తెలిపారు. వారి కుటుంబసభ్యులకు ఉపాధి అవకాశం కల్పించాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షలు నగదు సాయాన్ని అంద జేయాలని డిమాండ్ చేశారు. చనిపోయిన వ్యక్తుల కుటుంబ సభ్యులకు రాష్ట్రంలోని పలు మున్సిపాలిటిలలో నగదు అందజేశారని, ఒంగోలు నగరపాలక సంస్థలో ఎందుకు అందజేయడం లేదని ఆయన ప్రశ్నించారు. సిఐటియు నగర కార్యదర్శి టి.మహేష్ మాట్లాడుతూ చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉపాధి అవకాశం కల్పించకుండా మున్సిపాలిటీతో సంబంధం లేని వ్యక్తులను నియామకాలు చేస్తున్నారని విమర్శించారు. ఖాళీగా ఉన్న ఆప్కాస్ ఉద్యోగాలను అమ్ముకోవాలని చూస్తే యూనియన్ తరుపున పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు యు.రత్నకుమారి, కె.సామ్రాజ్యం, టి.విజయ, కె.మోహన్‌రావు, ఆర్.రాములు, సిహెచ్.అక్కేశ్వరరావు, బి.చిన్నబ్బాయి, ఇ. లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

మెరుగైన వైద్య సేవలే ధ్యేయం

- సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు
- నవంబర్ 4 వరకూ ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు
- డిఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ రాజ్యలక్ష్మి

ముఖాముఖి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లా ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించటమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి తెలిపారు. సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. స్ప్రేయింగ్, ఫ్రైడే డ్రైడేగా పాటిస్తూ దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నవంబర్ 4 వరకూ జరగనున్నాయన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను డిఎం,హెచ్ఓ ప్రజాశక్తికి వివరించారు. అవన్నీ ఆమె మాటలల్లోనే...

కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు చేపట్టాం. వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, అవసరమైన మందులు, అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. పట్టణ ఆరోగ్య కేంద్రాలను సందర్శించి వైద్య అధికారులు, సిబ్బందికి సలహాలు, సూచనలు ఇస్తున్నాం. రికార్డులు సక్రమంగా నిర్వహించేలా ఆదేశాలు ఇచ్చాం.

సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు

సీజనల్ వ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాం. దోమలు, నీటి ద్వారా వచ్చే వ్యాధులపై ప్రజలలో అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాలలో స్ప్రేయింగ్, ఫ్రైడే డ్రైడేగా పాటిస్తున్నాం. చీమకుర్తి గ్రానైట్ గనులు, నల్లమలలోని పాలుట్లలో దోమలు ఎక్కువగా వృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి. దోమల లార్వాలను నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. టైఫాయిడ్, వైరల్ జ్వరాలు మలేరియా, డెంగ్యూ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా కరపత్రాలు, అవగాహన సదస్సుల ద్వారా అవగాహన కలిగిస్తున్నాం. ప్రైవేట్ ఆసుపత్రులలో నమోదవుతున్న వైరల్ జ్వరాల వివరాలను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయానికి చేరేలా చర్యలు చేపట్టాం.

అర్బన్ పిహెచ్‌సిల్లో మెరుగైన వైద్యసేవలు

వైఎస్ఆర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లల్లో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు చేపట్టాం. ఒంగోలు, మార్కాపురం, కనిగిరి ప్రాంతాలలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్‌లో వైద్య సేవలు అందిస్తున్నాం. ఒంగోలు నగరంలో 4 అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల ద్వారా నగర ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయి. అర్బన్ పిహెచ్‌సిలలో వైద్యులతో పాటు ల్యాబ్ టెక్నీషియన్, పారా మెడికల్ సిబ్బంది నియమించి మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు చేపట్టాం.

4 వరకూ వైద్య శిబిరాలు

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు సెప్టెంబర్ 15 నుంచి ప్రారంభమయ్యాయి. నవంబర్ 4 వరకూ కొనసాగనున్నాయి జిల్లాలోని 8 నియోజకవర్గాలు, 38 మండలాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి రోగులను పరీక్షిస్తున్నారు. వైద్య శిబిరాలలో ఆయా నియోజకవర్గాలలోని ప్రజాప్రతినిధులు పాల్గొనేలా చర్యలు చేపట్టాం, వైద్య శిబిరాలలో రోగులను గుర్తించి మెరుగైన శస్త్ర చికిత్సల కోసం రిఫరల్ హాస్పిటల్స్‌కు పంపిస్తాం.